
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఆదివారం
19.11.2023



# మతాలతోనే
# జాతి సమైక్యత కల సాకారం

## ఛైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
ఛైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**దేశం మొత్తం ఉత్కంఠతో ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్స్ కోసం ఎదురుచూస్తోంది. గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఉన్న నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం భారత్– ఆస్ట్రేలియా జట్లు తలపడనున్నాయి. ఈనేపథ్యంలో ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ను నిలిపివేస్తామని ఖలిస్థాన్ ఉగ్రవాదులు హెచ్చరించడం ఆందోళన కరం మీరేమంటారు.**

**– కె. విజయకుమార్, కాకినాడ**

అవును విజయ్‌గారూ ఈ హెచ్చరికలలన్నీ నిషేధిత ఖలిస్తానీ సంస్థ 'సిక్కుస్ ఫర్ జస్టిస్' వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూన్ హెచ్చరికలే . ఈ క్రమంలో అతడు తాజాగా విడుదల చేశాడు. అందులో 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, 2002 గుజరాత్ అల్లర్ల గురించి మాట్లాడారు. అలాగే ముస్లిం, క్రైస్తవ వర్గాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం ఆ వీడియోలో కనిపిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంపై భారత్ వైఖరి గురించి కూడా పన్నూన్ మాట్లాడారు. కాగా.. పన్నూన్ బెదిరింపు వీడియోను విడుదల చేయడం ఇదే మొదటిసారి కాదు. అక్టోబర్ లో కూడా ఓ వీడియో విడుదల చేశారు. అందులో ఇజ్రాయెల్–పాలస్తీనా యుద్ధం నుంచి పాఠాలు నేర్చుకోవాలని, లేనిపక్షంలో భారత్ లోనూ ఇలాంటి 'ప్రతిచర్య' తలెత్తుతుందని ప్రధాని నరేంద్ర మోడీని హెచ్చరించారు. అలాగే సెప్టెంబర్ లో ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ లో జరిగిన భారత్–పాకిస్తాన్ మ్యాచ్ కు ముందు కూడా ఇలాంటి బెదిరింపులు జారీ చేయడం, శత్రుత్వాన్ని ప్రోత్సహించారనే ఆరోపణలపై పోలీసులు గురుపత్వంత్ సింగ్ పన్నూన్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మ్యాచ్‌కు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసారు.

**తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల హడావుడి తారాస్థాయికి చేరుకుంది. పోలింగ్‌కు మరో రెండు వారాలు మాత్రమే ఉండటంతో అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూకుడు పెంచారు. కాళ్లకు చక్రాలు కట్టుకొని నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. భారీ జన సమీకరణతో ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే జన సమీకరణ చేయాలంటే అభ్యర్థులకు తడిసి మోపడవుతుంది. ఎన్నికల ఖర్చు రూ. 40 లక్షలు దాటకూడదని ఎన్నికల సంఘం చెబుతున్నా.. కొన్ని నియోజకవర్గాల్లో రూ. 10 నుంచి రూ. 30 కోట్ల వరకు ఎన్నికల్లో ఖర్చు పెడుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మీరే మంటారు.**

**–వి. శాంత కుమారి, బిహెచ్ఈఎల్, హైదరాబాద్**

మీరన్నది నిజమే శాంత గారూ.... కార్తీక మాసం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కాస్త కలిసొచ్చిందనే చెప్పాలి. వారి ఖర్చును కొంచెం తగ్గించింది. ఈనెల 14 నుంచి కార్తీక మాసం మొదలైంది. కార్తీక మాసంలో హిందువులు నిష్ఠగా పూజలు చేసారు. ఈ మాసంలో నీచు, మద్యం వంటివి తీసుకోరు. ఇదే అభ్యర్థుల పాలిట వరంగా మారింది. సాధారణంగా ఎన్నికల ప్రచారానికి వెళ్తే.. సాయంత్రానికి మద్యం, బిర్యానీలు అందివ్వాల్సి ఉంటుంది. అయితే కార్తీక మాసం ఉన్నందున చాలా మంది మద్యం, నీచు ముట్టడం లేదు. దీంతో అభ్యర్థులకు కొంతలో కొంత ఖర్చు తగ్గుతుంది. ఈ విధంగా కార్తీక మాసం అభ్యర్థుల పాలిట వరంగా మారింది. ఈనెల 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ జరగుతుండగా.. కార్తీక మాసం డిసెంబర్ 12న ముగుస్తుంది. అంటే ఆలోగా ఎన్నికల ఘట్టం ముగుస్తుంది. దీంతో అభ్యర్థులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఆదివారాలు వనభోజనాల మాటున ఎంతో కొంత మొత్తం ఖరకచవుతునే ఉంటుంది. ఇక తెలంగాణలో అక్టోబరు 9 నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో పోలీసులు, ఎన్నికల అధికారులు, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేకంగా నిఘా ఉంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు ఏరులై పారే అవకాశం ఉండటంతో నిఘా కట్టుదిట్టం చేశారు. ఇప్పటి వరకు హైదరాబాద్‌లో 229 మందిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసారు. వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. రాష్ట్రంలో ప్రైవేటు మద్యం పార్టీలకు కూడా అనుమతి లేదని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. శుభకార్యాలు వంటి వాటిలో మద్యం పార్టీలు చేసుకోవాలంటే తమకు ఏ పార్టీతోనూ సంబంధం లేదని రూ. 100 బాండ్ పేపర్‌పై డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పడం ఇక్కడ గమనార్హం.

## లెజెండ్

### బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు

# భారతరత్న మదన మోహన మాలవ్య



భారత దేశ వాసులచే మహాత్ముని'గా గౌరవించ బడిన మహా మనీషి జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. అలాంటి గాంధీ చేతే మహామన బిరుదు పొందిన నేత పండిట్ మదన్ మోహన్ మాలవ్య. మదన్ మోహన్ మాలవ్య (1861%--%1946) భారతీయ విద్యావేత్త, రాజకీయ వేత్త. భారతీయ స్వాతంత్ర్యో ద్యమంలో పాల్గొన్న సమర యోధుడు. ఆయన "పండిట్ మదన్ మోహన్ మాలవీయ" గా కూడా సుపరిచితుడు. ఆయన "మహాత్మా" గా కూడా గౌరవింప బడ్డాడు. మాలవ్య1915 లో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా నాలుగు సార్లు పనిచేశాడు.

1861, డిసెంబర్ 25 తేదిన అలహాబాదులో మూనాదేవి, బ్రిజ్‌నాథ్ దంపతులకు జన్మించిన మదన్ మోహన్ మాలవ్య పూర్వీకులు మధ్యప్రదేశ్ లోని మాల్వా ప్రాంతం నుండి వలస వచ్చారట. అందుకే ఆయన ఇంటి పేరు కూడా మాలవ్యగా సార్థక మైంది. ఆయన అసలు ఇంటి పేరు చతుర్వేది. మాలవ్యాలు బెనార్స్ లోని అగర్వాల్ వర్తకులకు ఇంటి పురోహితులుగా ఉన్నారు. ఆయన తండ్రి సంస్కృత గ్రంథములను అభ్యసించేవాడు. ఆయన శ్రీమద్భాగ వతమును చెప్పి ధనం సంపాదించే వాడు. మాలవ్య సంప్రదాయకంగా రెండు సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఆయన ఆంగ్ల పాఠశాలలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు.

పాఠశాల రోజుల నుండే మకరంద్ అనే కలం పేరుతో కవిత్వం రాయడం ప్రారంభించాడు మాలవ్య. 1879 లో ముయిర్ సెంట్రల్ కాలేజీ నుండి మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు. ఆ కళాశాల ప్రస్తుతం అలహాబాదు విశ్వ విద్యాలయంగా ప్రసిద్ధి చెందినది. మాలవ్యా కలకత్తా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. లో పట్టభద్రుడైనాడు. సంస్కృతం లో ఎం.ఎ చేయాలనుకున్నప్పటికీ ఆయన కుటుంబ పరిస్థితులు సహకరించలేదు. తర్వాత ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని మొదలు పెట్టాడు. అంతకు ముందే ఆయన 'ది ఇండియన్ ఒపీనియన్' అనే పత్రికకు సబ్ ఎడిటర్‌గా పని చేశాడు. అలాగే న్యాయ శాస్త్రంలో కూడా పట్టా పొందాడు. 1907లో మాలవ్య స్వయంగా 'అభ్యుదయ' అనే వార్తాపత్రిక ప్రారంభించాడు. 1909 లో అలహాబాదు నుండి వెలువడు తున్న ఆంగ్ల పత్రిక లీడర్ పత్రికను స్థాపించాడు. ఆయన 1924 నుండి 1946 వరకు హిందూస్థాన్ టైమ్స్ కు ఛైర్మన్ గా ఉన్నాడు. ఆయన సేవలు 1936 లో హిందీ ఎడిషన్ ప్రారంభానికి ఉపయోగ పడ్డాయి.

1908లో బ్రిటీష్ ప్రభుత్వం పత్రికలపై ఆంక్షలు విధించి నప్పుడు.. వాటికి వ్యతిరేకంగా అలహాబాద్‌లో అఖిల భారత కాన్ఫరెన్సును నిర్వహించాడు. 1922లో హిందు మహాసభ అధ్యక్షుడుగా పనిచేశాడు. "సత్యమేవ జయతే" అనే నినాదాన్ని తొలినాళ్లలో ప్రాచుర్యం లోకి తీసుకొచ్చింది మాలవ్యనే. మాలవ్య భారత జాతీయ కాంగ్రెస్ కు అధ్యక్షునిగా నాలుగు సార్లు (1909, 1913,1919,1932) పని చేశాడు. ఆయన 1934లో కాంగ్రెస్ ను విడిచి పెట్టాడు. హిందూ మహాసభలో ముఖ్యమైన నాయకునిగా కూడా ఉన్నాడు.

1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రెసు పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు. 1922 లో చౌరీ చౌరా దాడుల ఘటనలో మరణశిక్ష పడిన 225 మంది స్వాతంత్ర్య సమర యోధులు, సాధారణ ప్రజానీకం తరపున వాదించి వారిలో 153 మందికి ఆ శిక్ష పడకుండా కాపాడ గలిగాడు.

గంగా నది పరిరక్షణ కోసం 'గంగా మహాసభ' పేరుతో ఉద్యమాన్ని కూడా లేవదీశాడు మాలవ్య.భారతీయ స్కౌట్స్ మరియు గైడ్సు వ్యవస్థాపకులలో మాలవ్య ఒకడు.బ్రిటీష్ నియంతల రాజ్యానికి ఊతమిచ్చేందుకు ప్రారంభించిన సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా గళం విప్పాడు. బ్రిటిష్ రాజ్యంలో భారత భవిష్యత్తును నిర్ధారించ దానికి ఏర్పాటైన సైమన్ కమీషన్ ను వ్యతిరేకించడానికి లాలా లజపతి రాయ్, జవహర్ లాల్ నెహ్రూ ఇంకా ఇతర స్వాతంత్ర సమర యోధులతో కలిశాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం వహించాడు."సత్యమేవ జయతే" అనే నినాదాన్ని వ్యాపింప చేసాడు. ఆయన గొప్ప విద్యావేత్త, కర్మయోగి, భగవద్గీతను అనుక్షణం అనుసరించడానికి ఇష్టపడే వాడు. సమకాలిక నాయకుల వలే కులమత భేదములను పోగొట్ట దానికి ప్రయత్నించాడు.

1932 ఆగస్టులో జరిగిన రెండవ రౌండు టేబులు సమావేశం తరువాత రామ్సే మెక్డొనాల్డ్ ప్రధాన మంత్రిగా ఉన్న బ్రిటిషు ప్రభుత్వం, బి.ఆర్.అంబేద్కర్ ప్రతిపాదన మేరకు బ్రిటిషు ప్రభుత్వం కమ్యూనల్ అవార్డును తీసు కొచ్చింది. ప్రభుత్వం అల్ప సంఖ్యాక మతస్తులకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయడం ఈ అవార్డు లక్ష్యం. అయితే ముస్లిములు, సిక్కులతో పాటు, దళితులను కూడా అల్ప సంఖ్యాక మతస్తులుగా ఈ అవార్డు ప్రకటించింది. అయితే మహాత్మా గాంధీ దీన్ని వ్యతిరేకించాడు. దళితులను విడదీస్తే హిందూ మతం విచ్ఛిన్నం అవుతుందని భావించి, అందుకు నిరసనగా గాంధీ పూనాలోని ఎరవాడ జైల్లో నిరాహార దీక్ష చేపట్టాడు. కాంగ్రెసు నాయకులు గాంధీ వాదనకు మద్దతు తెలిపారు. ఆ సమయంలో అంబేద్కరు ఎరవాడ జైల్లో గాంధీతో చర్చలు జరిపాడు. వారి చర్చల ఫలితంగా వెలువడిందే పూనా ఒప్పందం. 1932లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతిపాదించిన పూనా పాక్ట్ అగ్రిమెంట్ పై ఆయనతో కలిసి మాలవ్య సంతకం చేశాడు. మాలవ్య బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. ఇది ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వ విద్యాలయం, ప్రపంచం లోనే పెద్ద విశ్వ విద్యాలయం. ఇందులో 12,000 లకు పైగా విద్యార్థులు కళలు, విజ్ఞాన శాస్త్రము, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీలలో విద్యనభ్య సిస్తున్నారు. మాలవ్య ఆ విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా 1919 నుండి 1938 వరకు పనిచేశాడు.

జీవితకాలం మొత్తం బ్రహ్మచారిగానే గడిపిన మాలవ్య 1946 నవంబరు 12 (వయసు 84)న బనారస్ లో మరణించాడు. డిసెంబర్ 24,2014 న మదన్ మోహన్ మాలవ్యను ఆయన మరణానంతరం భారతదేశం లోని ప్రతిష్ఠాత్మక అవార్డు భారతరత్నకు వరించింది.

## నవ కవిత్వం

### ఓటంటే..!



ఓటంటే
నీ జేబులో నోటు కాదు
ప్రజాస్వామ్యాన్నిజి
పరిరక్షించే కోటు

ఓటంటే
సారా చుక్క కాదు
రాజ్యాంగ విలువలను
కాపాడే సిరా చుక్క

ఓటంటే
నీవు తిరిగే బెంజి కాదు
పేదోడికి దొరికే
మూడు పూట్ల గంజి

ఓటంటే
నీవు కూర్చునే సీటు కాదు
గూడులేని వారికి
నీవిచ్చే ప్లాటు

ఓటంటే
నీవు తాగే ఖరీదైన బీరు కాదు
సాగు భూమికి
నీవు ఇచ్చే నీరు

ఓటంటే
నీవు పవళించే పరుపు కాదు
రహదారి భద్రతకు
నీవు వేసే రోడ్డు

ఓటంటే
నీవు వృద్ధి కావడం కాదు
బడుగు జీవితాలను
నీవు చేసే అభివృద్ధి

ఓటంటే
నీవు ఇచ్చే తాయిలాలు కాదు
కనీస అవసరాలకు
నీవు ఇచ్చే సౌకర్యాలు

**కయ్యూరు బాలసుబ్రమణ్యం**
**7780277240**

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

ఈ ఆదివారం అనుబంధంలో దీపావళి లక్ష్మీ పూజ గురించి ప్రతి అంశంపై విపులంగా వివరించిన విధానం బాగుంది. అనేక అంశాలను ప్రస్తావిస్తూ మంచి విశ్లేషణలో కూడిన పదాల పాదరసాన్ని అందించిన రచయితకు, ప్రచురణకర్తలైన మీకూ ధన్యవాదాలు సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**–బి మధుశేఖర్, హైదరాబాద్**




**ఘుమఘుమలు అదురుతున్నాయి**

వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నెక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.

**– వారాంతపు రజనీ, వరంగల్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే రంకు ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు


**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**

## బాల్యమంటే ఇదేనా




రోడ్లపై ఎటు చూసినా పిల్లలే
చింపిరి గుడ్డలతో, గాయాలతో,
పస్తులతో
దురలవాట్లతో భారతావనిలో ఏ
నగర వీధుల్లో,
కూడళ్ళలో చూసిన బ్రతుకు
దుర్భరమైన బాలబాలికలే
బతుకు గమనం చిందరవందరైన
రేపటి తరాలు
కన్న వాళ్ళకు దూరంగా
దురలవాట్లకు దగ్గరగా
వారి బతుకు చిత్రం
అవును వీరు విధి వెక్కిరించిన
వీధి బాలలు
వీరు తెగి పడ్డ నింగి చుక్కలు
ఏ దిక్కు నుంచో వచ్చిన
దిక్కులేని మొగ్గలు
ఏ తల్లికి బరువయ్యారో ఏ
తండ్రికి భారమయ్యారో
ఇలా వీధిలో పడ్డారు
బాల్యమంటే ఇదేనా?
పిల్లలు దిక్కులేని వారైతే దేశమూ
దిక్కులేనిదే
ఈ ప్రపంచంలో ప్రకృతి
రమణీయతను
వారు ఆస్వాదించాల్సిందే
తల్లిదండ్రుల ప్రేమ వారు
లేకపోతే
సమాజపు విశ్వజనీన ప్రేమ,
రాజ్యాంగమిచ్చిన హక్కుల ప్రేమ,
చేరదీసే పాలకుల ప్రేమ అన్నీ
వారికి కావాలి
వారు ఉండాల్సిన వీధిలో కాదు
బడిలో
వారు ఉండాల్సింది వీధిలో కాదు
మైదానంలో
పిల్లల భవితకు కావాల్సింది
సందర్భం
అందుకు ప్రతినబూనాల్సింది
ప్రభుత్వం, పౌర సమాజం.

**పింగళి భాగ్యలక్ష్మి**
**9704725609**



# సూర్య బుడత



## బాలల కథ

# ప్రశ్నతోనే ప్రగతి




క్రిష్ణాపురం గ్రామంలో శేఖర్ ఐదవ తరగతి చదువుతున్నాడు. చదువులో ,తెలివి తేటలలో చురుకుగా ఉండేవాడు.మాష్టార్లు పాఠం చెపుతుంటే అనేక ప్రశ్నలు వేసేవాడు.తోటి విద్యా ర్థులు శేఖర్ కి బుర్ర తక్కువని ,ప్రశ్నల పుట్ట అని గేలి చేసేవారు.శేఖర్ మాత్రం అవేమి పట్టించుకునేవాడు కాదు. కొందరు మాష్టారులు కూడా ఊరికే ప్రశ్నలు వేస్తున్నాడని శేఖర్ ని విసుక్కు నే వారు.తోటి విద్యార్ధులు హేళన చేసినా ,బాధ పడని శేఖర్ మాష్టారులు విసుగు చెందడంతో బాధ పడేవాడు. ఇదంతా గమనించిన తెలుగు మాష్టారు బాలయ్య శేఖర్ ని పిలిచి 'నీవేమి బాధ పడకు !నీకు ఏ సందేహం ఉన్నా నన్ను అడుగు.నేను నివృత్తి చేస్తాను' అని భుజం తట్టి ప్రోత్సహించాడు.

అప్పటి నుండి ఎవరు ఏమనుకున్నా పట్టించు కోకుండా తన సందేహాలన్ని ప్రశ్నల రూపంలో బాలయ్య మాష్టారు ని అడిగి తెలుసుకునేవాడు శేఖర్.తోటి విద్యార్థులు,మిగతా మాష్టారులు ఒకరేమో పరమానందయ్య మరొకరు ఆయన శిష్యుడు అంటూ శేఖర్ ని ,బాలయ్య మాష్టారు ని ఎగతాళి గా అనుకునేవారు.ఈలోగా గ్రంధాలయ వారోత్సవాలు మొదలయ్యాయి.

జిల్లా స్థాయిలో విద్యార్ధులకు క్విజ్ పోటీలు జరిగాయి.అందులో శేఖర్ ప్రధమ స్థానంలో నిలిచి జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా బహుమతి అందు కొన్నాడు.శేఖర్ కి తర్ఫీదు ఇచ్చినందుకు బాలయ్యని అభినందించాడు కలెక్టర్.ఈ విషయం తెలుసుకున్న మండల విద్యా శాఖాధికారి , శేఖర్ పాఠశాలకి వచ్చి అభినందన సమావేశం ఏర్పాటు చేశారు.శేఖర్ కి తర్ఫీదునిచ్చిన బాలయ్య మాష్టారు ని మాట్లాడ మన్నారు.తన ఎదురుగా కూర్చున్న విద్యార్ధులు, మాష్టారులను ఉద్ధేశ్యిస్తూ "ప్రతి విద్యార్థి తెలివైనవాడే.కాని శేఖర్ మాత్రం తన సందేహాలను ఎప్పటి కప్పుడు నివృత్తి చేసుకునేవాడు.

తన ప్రశ్నకు సరైన సమాధానం దొరికే వరకు నిద్రపోయే వాడు కాదు.శేఖర్ ప్రశ్నలకి సమాధానం కోసం నాకు తెలియక పోతే పుస్తకాలను తిరగవేసేవాడిని.అతని ప్రశ్నల వలన నేను కొంత జ్ఞానాన్ని పొంద గలిగాను. ప్రతి విద్యార్థి తెలుసుకోవాలనే తపన ఉంటే జ్ఞానాన్ని పొందవచ్చు.ఈ సందర్భంగా నాకు ఐదవ తరగతి లోని పద్య రత్నావళి లో నార్ల వెంకటేశ్వర రావు గారి పద్యం ఒకటి గుర్తుకొస్తోంది.ఈ పద్యం కూడా మీకు గతంలో చెప్పాను.ప్రశ్న నుండి పుట్టు పరిణతి జ్ఞానమ్ము...ప్రశ్నతోడ పెరుగు ప్రాభవమ్ము...ప్రశ్నలేక ప్రగతి ప్రశ్నార్ధకమ్మురా..నవయుగాల బాట నార్ల మాట అనగా ప్రశ్నించుట ద్వారానే జ్ఞానము,కీర్తి వస్తాయి.అదిలేక పోతే ప్రగతి శూన్యం అవుతుందని కవి చెప్పాడు.అదే ఇప్పుడు శేఖర్ పాటించాడు.జిల్లా స్థాయిలో మన పాఠ శాలకు కీర్తి తీసుకొచ్చాడు.శేఖర్ ద్వారా మన అందరికీ,మండలానికి పేరు వచ్చింది.కాబట్టి ప్రతి విద్యార్థి తన సందేహాలను ప్రశ్నల ద్వారా తెలుసుకోవాలి, ప్రతి ఉపాధ్యాయుడు సందేహాలన్ని నివృత్తి చేయాలి.దీనివలన గురు శిష్యుల జ్ఞానం పెరగడమే కాని తరగడం ఉండదు."అంటూ తన ప్రసంగాన్ని ముగించాడు.బాలయ్య ఉపన్యాసాన్ని విన్న విద్యార్థులు, మాష్టారులు వారిరువురిని హేళన చేసినందుకు ఒక్క క్షణం సిగ్గు తో తలదించుకుని వెంటనే తేరుకుని చప్పట్లతో అభినందించారు.

**ఎకయ్యూరు బాలసుబ్రమణ్యం**
**7780277240**




### Autumn Alphabet Challenge



Can you come up with an Autumn themed word for each letter of the alphabet?

| | | | |
|---|---|---|---|
| A | | N | |
| B | | O | |
| C | | P | |
| D | | Q | |
| E | | R | |
| F | | S | |
| G | | T | |
| H | | U | |
| I | | V | |
| J | | W | |
| K | | X | |
| L | | Y | |
| M | | Z | |

### Element Crossword




| Across | | Down | |
|---|---|---|---|
| 3 | Na | 1 | Si |
| 5 | C | 2 | Ar |
| 7 | N | 3 | S |
| 8 | B | 4 | H |
| 9 | Al | 6 | P |
| 14 | Be | 10 | Li |
| 15 | He | 11 | Mg |
| 16 | F | 12 | O |
| 17 | Ne | 13 | Cl |



# విధి వంచితుల జీవన చిత్రాలే సీరపాణి 'ధ్వంసరచన'

మహాప్రస్థానంలో మహాకవి శ్రీశ్రీ 'ఋక్కులు' అనే కవితా ఖండికలో ఇలా అంటారు. 'కుక్కపిల్లా/ అగ్గిపుల్లా /సబ్బుబిళ్ళా /హీనంగా చూడకు దేన్నీ/ కవితా మయమేనోయ్ అన్నీ' అంటూ 'కాదేదీ కవిత కనర్హం' అనే అర్ధాన్ని స్ఫురింపజేస్తాడు. 'జగన్నాథుని రథచక్రాలు' అనే మరో కవితలో 'నట 'ధూర్జటి/ నిటాలాక్షి పగిలిందట/నిటాలాగ్ని రగిలిందట/నిటాలాక్షి పటాలుమని/ప్రపంచాన్ని భయపెట్టింది/అరె ఝూన్ ఝూన్/ఝుటక్ ఫటక్/హింస నచణ/ధ్వంస రచన/ ధ్వంస నచణ/హింస రచన' అంటూ ఓ విధ్వంసక వాతావరణాన్ని సూచిస్తారు. అయితే ఆ వాక్యాల్లోని 'ధ్వంసరచన' అనే పదాన్ని ప్రయోగించారు. ఆ ఒక్క పదములో ఎంత అర్ధం ఇమిడి ఉందో? తెలుసుకోవాలంటే కళింగాంధ్రకు చెందిన అభ్యుదయ కవి సీరపాణి రచించిన 'ధ్వంసరచన' కవిత చదివితే తెలుస్తుంది. ఈ కవిత సీరపాణి రచించిన 'డమరుధ్వని' కవితా సంపుటి లోనిది.





**'ఆశయ జ్యోత్స్నల అన్వేషణలో**
**ఇరుల ఉరులలో తగుల్కొన్న**
**ఈ ఆశాజీవులు–**
**విశ్వ రచయిత చేతిలో**
**ఔచితిని కోల్పోయిన పాత్రలు'**

ఆశాజీవులు ఆశయాల వెన్నెలలను వెతుక్కుంటూ వెళుతున్నారు. కానీ ఆ ప్రయత్నంలో వారికి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. వాళ్ళు చీకటి ఉచ్చులో చిక్కుకున్నారు. తమను తాము విడిపించుకోలేక తమను విడిపించేవారు లేక ఆ వలలో గిజగిజలాడిపోతున్నారు. వాళ్ళను కవి ఎలా పోల్చుతున్నాడో! చూడండి. అలాంటి బంధితుల్ని విశ్వ రచయిత అంతటివాని చేతిలో ఔచిత్యం కోల్పోయిన పాత్రలుగా అభివర్ణిస్తున్నాడు. ఇంకెవరు ఆ పాత్రలని సరిదిద్దగలరు?

**'ప్రగతి పథంలో పయనించబోయి**
**విఘాతాల ప్రఘాతాలకు బలియైన**
**ఈ అనాథులు–**
**విశ్వశిల్పి అంచనా వమ్మయి**
**వికలాంగులైన జగన్నాథులు'**

ప్రగతిశీలురైన కర్మవీరులు సమాజాభ్యుదయం కోసం నిస్వార్థంగా అభివృద్ధి పథంలో తమ కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. కానీ వారికి తమ ప్రయత్నంలో ఆటంకాలకూ, ఎదురు దెబ్బలకూ బలైపోతున్నారు. వారంతా అనాథులు. వారిని ఉద్ధరించే వారెవరూ లేరు. ఈ అనాథుల్ని కవి జగన్నాథులతో పోల్చుతున్నారు. జగన్నాథుడు సుభద్ర, బలభద్రులతో కూడి పూజింపబడే దేవుడు. పూరీ జగన్నాథస్వామి వారి విషయంలో స్కంధ పురాణంలో ఒక ఐతిహ్యం ఉంది. అదేమిటంటే, అవంతి దేశాన్ని ఇంద్రద్యుమ్నుడు అనే రాజు పాలించేవాడు. అతని భార్య పేరు గుండిచదేవి. అతనికి ఒకసారి ఒక కోరిక కలిగింది. సాక్షాత్తు విష్ణుమూర్తినే కరచరణాద్యవయవాలతో ఆలయంలో ప్రతిష్ఠించాలని. స్వామి అతనికి కలలో కనిపించి ముందు ఆలయ నిర్మాణం చెయ్యి. తరువాత నేనే నా నిజరూపంతో వచ్చి ఆలయంలో కొలువుంటాను అని చెప్పాడు. రాజు ఆలయ నిర్మాణం చేశాడు. స్వామి కోరిన ప్రకారం సముద్రంలో తేలియాడుతున్న ఒక కర్రదుంగను ఒడ్డుకు తెచ్చి దాన్ని విగ్రహాలుగా చెక్కడానికి శిల్పులను పిలిపించారు. వారు తమకు రాతి మీద శిల్పాలు చెక్కడం తప్ప దారువు మీద శిల్పాలు చెక్కడం రాదన్నారు. ఇంతలో ఒక అజ్ఞాత వ్యక్తి అక్కడకు వచ్చి నేను దారు శిల్పాలు చెక్కుతాను. కానీ నాదొక షరతు. నేను స్వామి వారి విగ్రహాలు చెక్కడానికి ఇరవై ఒక్క రోజులు పడుతుంది. నేను గదిలోకి పోయి తలుపులు మూసుకొని పనిలో ఉంటాను. నేను తెరిచే వరకూ ఎవరూ తలుపులు తెరవకూడదు అంటాడు. రాజు అలాగే అని అంగీకరిస్తాడు. కానీ కొద్ది రోజుల తరువాత ఉలి చప్పుడు ఆగిపోతుంది. రాజుగారికి దేవేరికి అనుమానం వస్తుంది. దేవేరి ఒత్తిడి చేయడం వల్ల రాజు తలుపులు తెరిపించి చూస్తాడు. చూసేసరికి శిల్పి మాయమైపోతాడు. బలభద్ర సుభద్ర జగన్నాథ స్వాముల వారి మూడు విగ్రహాలు కాళ్లూ చేతులు లేక అసంపూర్ణంగా మిగిలిపోతాయి. తరువాత బాధపడుతున్న రాజుకు స్వామివారు కలలో కనిపించి నేను పెద్ద నేత్రాలతో రెప్పపాటు లేకుండా నా చూపులతోనే అనుగ్రహిస్తాను బాధపడకు అని చెప్పాడు. స్వామియే విశ్వకర్మ రూపంలో వచ్చి ఉంటారని రాజు తెలుసుకున్నాడు.

**'సమతా భవితవ్య నిర్మాణ సాహస కృత్యంలో**
**సగం నలిగిపోయిన**
**ఈ అనూరులు–**
**భువన చిత్రకారుని సుందర భావనా ప్రకృతికి**
**భగ్న సమాధిలో**
**వికృతులై మిగిలిపోయిన పిచ్చిగీతలు'**

మనకు స్వాతంత్రం లభించక ముందు తరువాత కూడా దేశంలో సామ్యవాదం కోసం పోరాటం చేసే వాళ్ళు కోకోల్లలుగా ఉన్నారు. అలా నాడూ నేడూ అభివృద్ధి నిరోధక శక్తులతో పోరాటం చేసి నెగ్గలేక జీవితాలు ఛిద్రమైపోయిన వాళ్ళు ఎందరో ఉన్నారు. కవి అట్టి వారిని అనూరుడితో పోల్చుతున్నాడు. దానికో పురాణగాథ ఉంది. కశ్యప ప్రజాపతి భార్యలు కద్రువ, వినతలు. కశ్యపుడు వారికి సంతానం ప్రసాదిస్తాడు. కద్రువకు ఇచ్చిన అండాలు వివిధ సర్పాలై జన్మించాయి. వినతకు ఇచ్చిన అండాలు ఎప్పటికీ ఫలించకపోవడంతో సహనం కోల్పోయిన ఆమె ఒక అండాన్ని చిదిమి చూసింది. దానినుండి ఒక తేజోమూర్తి ఐన పురుషుడు ఉద్భవిస్తాడు. కానీ అతనికి ఇంకా ఊరువులు నిర్మితం కాలేదు. తల్లి అమాయకత్వానికీ, అసహనానికి అతడు బాధపడి అండం నుండి బైటపడతాడు. అతడే అనూరుడు. అంటే తొడలు లేనివాడు. కనీసం రెండో అండాన్నైనా భద్రంగా చూసుకొమ్మని చెప్పి అంతర్ధానమైపోతాడు. అతన్నే సూర్యభగవానుడు తన రథసారథిగా నియమించుకుంటాడు. ఆ తరువాత కొంత కాలానికి ఆ రెండో అండము నుండి గరుత్మంతుడు జన్మిస్తాడు. అతడు విష్ణుమూర్తి వాహనంగా నియోగింపబడతాడు. అయితే కవి వారిని అనూరులుగా చెప్పి ఊరుకోలేదు. వాళ్లను చిత్రకారుని పిచ్చిగీతలుగా పోల్చాడు. ఆ చిత్రకారుడు ఎవరు? భువన చిత్రకారుడు. ఈ విశ్వాన్నే సృష్టిగా చిత్రరచన చేసినవాడు. కాకపోతే అంతటి వాని చేతిలో కూడా వీరికి న్యాయం జరగలేదు. ఎందువలన? ఆయన చిత్రాలను చిత్రించే ముందు సుందరంగానే ఊహించాడు. కానీ అతనికి సమాధి భగ్నమైంది. కవికైనా, కళాకారునికైనా రచన చేస్తున్నప్పుడు సమాధిస్థితి అవసరం. దాన్నే మనం 'మూడ్' అంటాం. అది భగ్నమైతే ఆ రచన వికృతంగా తయారవుతుంది. అందువలనే కవి వారిని వికృతిలై మిగిలిపోయిన పిచ్చిగీతలని అభివర్ణించాడు.

**'స్వార్థ విపిన విచ్ఛేదనా సంకుల సమరంలో**
**ఎదురు దెబ్బలకు విలవిలలాడే**
**ఈ అంతరంగాలు–**
**అనురాగపు తీగ తెగిన**
**వర్తమాన వల్లకీ సంగీతంలో ధ్వనించిన**
**అపస్వర తరంగాలు'**

స్వార్థం అనేది ఒక అడవి వంటిది. అది దుర్భేద్యమైనది. దాన్ని తెగనరికితే కాని సమాజంలో సామ్యవాద స్థాపన జరగదు. దానికోసం సంకుల సమరం చెయ్యవలసిందే. ఆ సమరంలో ఎందరో ప్రగతివాదులు కుటుంబాలను సైతం గాలికి వదిలి విలవిలలాడిపోతారు. అలాంటి త్యాగజీవుల అంతరంగాలను కవి మానవత్వం అనే తంత్రి తెగిపోయి వర్తమానం అనే వీణ పలికించే అపస్వర తరంగాలుగా అభివర్ణిస్తున్నారు.

విశ్వరచయిత, విశ్వశిల్పి, భువన చిత్రకారుడు వంటి మహోన్నతుల చేతిలో సైతం సృష్టి ఎలా వికలమైపోయిందో! కవి వర్ణించాడు. ఇలా ఒక మహాకవి పదప్రయోగంలో ఇన్ని విశేషాంశాలను విపులీకరించిన రచయిత నిజంగా అభినందనీయుడు. ఈ కవిత రచనాకాలం 1972 వ సంవత్సరం. ఈ కవిత 1973 మే 'భారతి' మాస పత్రికలో ప్రచురితమైంది.

**పిల్లా తిరుపతిరావు,7095184846**

## నీ సౌఖ్యం కోసం



నీవు కన్నీరు పెడుతుంటే
నా గుండెలో తుఫాను రేగుతోంది
నీ కష్టాలు నా సుఖాలను దూరం చేస్తోంది
ఎప్పుడూ నీ సౌఖ్యం కోసం వెంపర్లాడే
నా హృదయం దుఃఖపు సంద్రంలో
ఊపిరాడకుండా మునిగితేలుతోంది
ఎప్పుడు చూసినా శాంతియుతంగా
వెలుగులు చిందే నీ వదనంలో
నేడు నీ చిరునవ్వులు బీటలు
వారినట్టుగా మారిపోతుంటే
నాలోని ప్రేమ కుమిలి కుమిలి రోదిస్తోంది
మళ్లీ నీహృదయంలో
పచ్చని బ్రతుకు పండాలంటే
ఏం చేస్తే నీ జీవితరథం సవ్యంగా సాగుతుందో
ఎంతగా మనసును
మధించినా మతికి తోచకున్నది
కా ఒక్కటే అనిపిస్తోంది
నీవు మాత్రమే చెయ్యగల
నీకు మాత్రమే సాధ్యమయ్యే
ఒక దివ్యాస్త్రం నువ్వు సంధించాలి
అప్పుడే నీ మనో వ్యాకులతకు
కారణమైన వారెవరైనా సరే
వారి కర్మను నువ్వు శాసిస్తావు ఇది తథ్యం.
అప్పుడే నీ కన్నీరు పన్నీరై
నీ బ్రతుకు బంగారు బాట కాగలదు .

నాగముని. యం
9490856185

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com
SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ ఈడుప్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 19.11.2023 నుంచి 25.11.2023 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వృత్తిపరంగా భాగస్వామితో కలిసి నిర్ణయాలు తీసుకుంటారు. కుటుంబంలో జరగవలసిన ముఖ్యమైన కార్యాల కోసం చర్చలు జరుగుతాయి. సాంఘికంగా గుర్తింపు పలుకుబడి పెరుగుతుంది. మీ సలహాలు కొరకు ఇతరులు మిమ్మల్ని సంప్రదిస్తారు. భాగస్వామి ఆరోగ్యం బాగుంటుంది. తోబుట్టువులతో ముఖ్యంగా స్త్రీలతో కలిసి చర్చించి కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. కంటి విషయంలో, మాటలు విషయంలో జాగ్రత్త అవసరం. ముఖ్య వ్యక్తులతో అపార్ధాలకు అవకాశాలు లేకుండా ఆత్మీయులను సంప్రదించి మాట్లాడటం మేలు. ఆర్థికంగా అనుకూలంగా ఉన్నప్పటికీ ప్రణాళిక బద్ధంగా లేని ఆకస్మిక ఖర్చులు చికాకులు, ఆందోళనని కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో, ముఖ్య ప్రయాణాలు, నిర్ణయాలు కొంత వాయిదా.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలోకుటుంబంలో అనుకూలత, వాతావరణం బాగుంటుంది. ఆధ్యాత్మి ప్రదేశాలని సందర్శించడానికి ప్రయత్నాలు చేస్తారు. భాగస్వామికి వృత్తిపరంగా గౌరవము గుర్తింపు. అనుకున్న దాని కంటే ఎక్కువ ఖర్చు చేసి గృహాన్ని అందంగా అలంకరించుకుంటారు. విదేశాలలో ఉన్న చిన్ననాటి మిత్రులతో ముఖ్య సంప్రదింపులు. ముఖ్యంగా భూమికి సంబంధించిన అంశాలలో కొన్ని చికాకులు, ముఖ్య పనులలో ఆలస్యం. దూర ప్రదేశాల నుంచి ఆహ్వానాన్ని అందుకుంటారు. సంఘంలో గుర్తింపు గౌరవం పెరుగుతుంది మీ శ్రమకు తగిన రివార్డులు. కృషి శీలత పెంచుకుంటారు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సంతాన అభివృద్ధి సంబంధించిన ప్రణాళికలు. ఆలోచనలు బాగుంటా యి మంచి నిర్ణయాలు తీసుకుంటారు



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

ప్రారంభములో ముఖ్యమైన పనులు, ఆరోగ్య విషయంలో అలోచించి నిర్ణయాలు అవసరం. వృత్తిపరంగా పడిన కష్టానికి తగినంత గుర్తింపు రావటం లేదని బాధపడతారు. ఆత్మవిశ్వాసాన్నిపెంచుకోవాలి. తెలియని ఆందోళన అసంతృప్తి ముఖ్యమైన పనులు ముందుకు వెళ్ళకుండా నిరోధించే అవకాశాలు. జీర్ణ సంబంధ చికాకులు. ఆరోగ్యముపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అధికారంలో ఉండే కొత్త వ్యక్తులతో పరిచయాలు. తండ్రి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెడతారు. విద్యాపరంగా విద్యార్థులు కొత్త ప్రాజెక్టులు చేస్తారు. వారి శ్రమకి గుర్తింపు కొంత లభిస్తుంది. స్వగ్రామము వెళ్ళటానికి ఆలోచనలు. సంతానం విషయంలో మీరు ఆశించిన స్థాయిలో వారికి వచ్చే ఫలితాలు కొంత తక్కువ



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభం భాగస్వామి వృత్తి సంబంధ, మరియు మీ అభివృద్ధి అంశాలు, చాలా కాలముగా వాయిదా పడుతున్న వాహన, గృహ సంబంధ అంశాల పరమైన చర్చలు. వారము మధ్యలో నూతన వ్యక్తుల కొరకు విందు వినోదములు కొరకు ఆకస్మిక ఖర్చులు. అవసరమైన కొనుగోలు మొదలైన వాటి కోసం ఆలోచనలు చేస్తారు. వారాంతం దీర్ఘకాలిక పెట్టుబడులకై కుటుంబములోని స్త్రీలతో కలిసి ఆలోచిస్తారు. వ్యవసాయ సంబంధ అంశాలు ఆలోచనకి వస్తాయి. స్వగ్రామాన్ని సందర్శించడానికి ప్రణాళికలు వేసుకుంటారు. విశాల గృహ నిర్మాణం కొరకు ఆత్మీయులతో సంప్రదిస్తారు. వృత్తిపరమైన భాగస్వాములతో అభిప్రాబేధాలు రాకుండా చూసుకోవాలి. దూర ప్రదేశాలలో ఉండే ఆత్మీయుల ద్వారా ఆకస్మిక బహుమానం అందుకుంటారు.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారము ప్రారంభము పోటీలలో నెగ్గడానికి తీవ్రంగా కృషి చేస్తారు. శత్రువులపై విజయం సాధిస్తారు. నైపుణ్యాలను పెంచుకుంటూ ముందుకు వెళతారు. భాగస్వామికి వృత్తి పరంగా అభివృద్ధి కరంగా ఉంటుంది. అధికారము ఉం డే ముఖ్య స్త్రీలు సహకరిస్తారు. నూతన ఉపాధి అవకాశము. స్నేహితులు సహకరిస్తారు వృత్తిపరంగా అభివృద్ధి కరంగా ఉంటుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది. ధైర్యముగా నిర్ణయాలు తీసుకుంటారు. విదేశీ సంబంధ అవకాశాలు వచ్చినప్పటికీ పూర్తిగా నిర్ణయం తీసుకోరు. బంధు వర్గాన్ని కలుస్తారు. నిరుద్యోగులకు వృత్తిలో కొత్త అవకాశాలు. కుటుంబ కార్యాలలో పాల్గొంటారు. ఇష్టమైన ఆత్మీయుల కోసం అధికంగా ఖర్చు చేస్తారు. వారంతములో ఆశించిన ఫలితాలు పొందటానికి ఎక్కువ శ్రమ పడతారు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో సంతానముతో అభిప్రాయ బేధములు రాకుండా నిదానముగా ఆలోచనలు చేయాలి. సమయస్ఫూర్తిగా ఆలోచనలు చేసి ముందుకు వెళ్లే ప్రయత్నాలు. కుటుంబంలో సభ్యులమధ్య వాతావరణం కొంత చికాకు ఉంటుంది. అయినప్పటికీ మీరు అందరిని కలుపుకుంటూ ముందుకు వెడతారు. బంధు మిత్రులను కలుస్తారు. ప్రయాణాలలో పరిచయము లేని వ్యక్తులతో ఇబ్బంది కాకుండా జాగ్రత్త తీసుకోవాలి. వారాంతములో ఇంతకు ముందు తీసుకున్న రుణములు చెల్లించడానికి ప్రయత్నాలు. వృత్తిపరంగా శ్రమ అధిక బాధ్యతలు. తోబుట్టువులతో మంతనాలు సాగిస్తారు. కొత్త వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి, మీడియటర్స్ ని నమ్మి మోసపోవద్దు ముఖ్య లావాదేవీలలో. ఆత్మీయులు, సేవకులు సహకరిస్తారు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో సమయానికి ఆహార స్వీకరణ అవసరము. నూతన అంశాలు నేర్చుకుంటారు. వృత్తిలో విదేశీ ఆదాయాన్ని పొందేందుకు అవకాశముంది. విద్య, కళారంగంలో ఉండే వారికి అనుకూలంగా ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెంచుకుంటారు. శ్రమకు తగిన గుర్తింపు గౌరవాన్ని వృత్తి పరంగా పొందుతారు. మీపై మీకు ఆత్మవిశ్వాసం అధికంగా ఉంటుంది. వృత్తిపరంగా అదనపు బాధ్యతలు. ఆలోచనలు బాగుంటాయి. మీలోని సృజనాత్మకతతో కొత్త రచనలు చేస్తారు. కొత్త వ్యక్తులతో వ్యవహరిం చేటప్పుడు లేదా పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగ్రత్త అవసరం. తోబుట్టువులతో సమావేశాలు చర్చలు. చిన్న ప్రయాణాలు చేస్తారు. భూమికి సంబంధించి, తల్లి వైపు బంధువులకు సంబంధించి కలహాలు రాకుండా జాగ్రత్త వహించాలి



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో ఒక ముఖ్య విషయంలో మిత్రులు, ఆత్మీయులు కొంత సహకరిస్తారు. ధైర్యం పెరుగుతుంది వాహన గృహ సంబంధిత విషయాలలో ఖర్చులు అధికంగా ఉన్నప్పటికీ ఇష్టమైన వస్తువు కొనుట కొరకు వెనుకాడరు. తోబుట్టువులు లేదా మిత్రులకు సంబంధించిన వారికి ప్రణాళికల్లో సలహాలిస్తూ సహకరిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య విషయాలు చర్చిస్తారు. నాయకత్వ లక్షణాలు పెరుగు తాయి సంఘంలో పలుకుబడి పెరుగుతుంది. శుభకార్యాల కొరకు నిర్ణయాలు తీసుకుంటారు. దేవాలయములు సందర్శించడానికి ప్రణాళికలు వేసుకుంటారు. ఆధ్యాత్మికంగా చేసే ప్రయాణాలు కొంత సంతృప్తిని ఇస్తాయి. కొత్త వ్యక్తులు పరిచయాలు వారి ఆశీస్సులు తీసుకుంటారు. ధైర్యంగా సంతృప్తికరంగా వృత్తిపరంగా అభివృద్ధి ప్రణాళికల్లో కొత్త వ్యక్తుల జోక్యం చికాకు కలిగిస్తుంది.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరాషాఢ 1వ పాదము

ప్రారంభములో భావోద్వేగములు నియంత్రణ అవసరము. మనసు కొంత అలజడి ఉన్న ప్రశాంతంగా ఉంచే ప్రయత్నాలు చేసుకుంటారు. రావలసిన ధనం అందటంలో కొంత ఆలస్యాలు ఆటంకాలు చికాకును కలిగించినప్పటికీ అధిగమిం చ గలుగుతారు. చిన్ననాటి మిత్రులను, తోబుట్టువులను కలుస్తారు. సమావేశంలో మీ గుర్తింపు గౌరవం పెరుగుతుంది. భాగస్వామి సహకారం ఉంటుంది. రిసార్ట్స్ మొదలైన వాటికి వెళ్ళడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ఆదాయ పరంగా కొంత వృద్ధికరంగా ఉంటుంది. దూర ప్రదేశాల నుంచి అందె కొన్ని విషయాలు మీకు ఆలోచన కలిగిస్తాయి. ప్రయాణాలు సామాన్యముగా ఉంటాయి. స్త్రీలతో అభిప్రాయ బేధాలు రాకుండా వ్యవహరించాలి. కమ్యూనికేషన్ బాగుంటుంది



## మకర రాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభము శ్రమకి తగిన విలువ వస్తుంది. ఆదాయం సామాన్యము కుటుంబ సభ్యులలో ఒకరికి వృత్తిపరంగా నూతన అవకాశములు. మీ వృత్తిలో కొంత అభివృద్ధి ఉంటుంది ఆశించిన గౌరవం పెరుగుతుంది. ఆలోచన వినిపిస్తాయి సృజనాత్మకత పెరుగుతుంది కళా రంగంలో ఉండే వారికి రాణింపు. విద్యార్థులకు సైంటిఫిక్ గా కొత్త ఆలోచనలు చేస్తారు. స్త్రీ సంతానానికి విద్యా పరంగా అభివృద్ధికరంగా ఉంటుంది వారు ఎంచుకున్న రంగాల్లో నూతన అవకాశాలు. ఉపాధ్యాయులకి , ప్రైవేట్ బిజినెస్ చేసే వారికి కొంతవరకు అభివృద్ధి. పెద్దవారికి ఆధ్యాత్మిక ఆలోచనలు పెరుగుతాయి. సంతానం జ్ఞాపక శక్తిని పెంచుకునే విధంగా కృషి చేయాలి. చిన్న పరిశ్రమ వారికీ కొంత అభివృద్ధికరంగా ఉంటుంది.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభం భూమి నూతన గృహము మొదలైన వాటి గురించి ఎదురుచూస్తున్న విషయాలు సంతృప్తిని ఇస్తాయి. ఆధ్యాత్మిక ప్రయత్నాలతో పుణ్యబలాన్ని పెంచుకునే దిశగా ఆలోచనలు చేస్తారు. అనుకూలంగా ఉంటాయి. మీ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది సామాజిక సేవ చేస్తారు దూర ప్రదేశాలలో విద్య కొరకే విద్యార్థులు చేసే ప్రయత్నాలు ఆశజనకంగా మొదలైన వాటితో ప్రారంభమవుతుంది. తమ రంగలలో పోటీలలో నెగ్గేందుకు తీవ్రంగా కృషి చేస్తారు. ఆధ్యాత్మిక కృషితో పెద్దలని కలవడం వారి ఆశీస్సులు తీసుకోవడం గురువుల్ని కలవడం వారి సలహాలు పాటించటం. మధ్యలో విదేశీ వృత్తికి చర్చలు. కుటుంబంలో వాతావరణం కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. ఆరోగ్యము సామాన్యంగా ఉంటుంది.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో సామాజిక సేవతో గుర్తింపుగౌరవాన్ని పొందుతారు. కమ్యూనికేషన్ బాగుంటుంది. పరాక్రమం పెరుగుతుంది. విదేశీ విద్య కొరకు ప్రయత్నం చేసే విద్యార్థులకు కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. వృత్తి పరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. అధికారుల మెప్పు పొందడానికి అవకాశాలు ఉన్నాయి. దూర ప్రదేశాల నుంచి రావలసిన బకాయిలు అందుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు ఉన్నప్పటికీ అనుకోని ఖర్చులు, ఆధ్యాత్మిక ప్రదేశాల సందర్శన మానసిక తృప్తి,ఆనందాన్నిస్తుంది. స్థాన చలనానికి కొంత అవకాశాలు. సంతానానికి విద్యాపరంగా ఖర్చులు అధికంగా ఉంటాయి. ముఖ్యమైన ఆత్మీయులకు సహకరించడానికి సమయానికి కొంత ధనాన్ని వెచ్చిస్తారు. మనసు ప్రశాంతంగా ఉంటుంది.

# మతాలతోనే జాతి సమైక్యత కల సాకారం



**రాష్ట్రీయ ఏక్తా దివస్..దీన్నే మనం జాతీయ సమైక్యతా దినోత్సవంగా వ్యవహరిస్తూ..ఎంతో శ్రద్ధతో నిర్వహించుకుంటున్నాం.'జాతీయ సమైక్యత'కు ప్రధానంగా మతతత్వం, కులతత్వం, ప్రాంతీయవాదం, భాషావాదం మరియు సంకుచిత మనస్తత్వం లాంటి దురాచారాలను సమాజంలో నుండి పారద్రోలేందుకు నిర్దేశించిందే రాష్ట్రీయ ఏక్తా దివస్... దేశంలోని పలు వర్గాలు, కులాలకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న అసమానతలను తొలగించాలన్నదే ముఖ్య ఉద్దేశం**

జాతీయ సమైక్యత అనేది చాలా విస్తృతమైన పదం. జాతీయ సమైక్యతను అర్థం చేసుకునే ముందు సమైక్యత అంటే ఏమిటో తెలుసుకోవాలి. 'సమైక్యత' అనే పదం ప్రజల మధ్య ఏకత్వాన్ని సూచిస్తుంది. అది ఎప్పటికీ విచ్ఛిన్నం కాదు. ఆలోచనలు, నమ్మకాలు, నడవడిక, దిన చర్యలలో ఎన్నో వైవిధ్యాలు ఉన్న వ్యక్తుల సమూహం గురించి మనం మాట్లాడేటప్పుడు ఇది చాలా ముఖ్యం. సమీకృత భావనతో, ప్రజలందరి సంక్షేమం కోసం ఆలోచించి, పనిచేయాలి. జాతీయ సమైక్యత అనేది దేశ ప్రజలలో సమగ్రతను పెంపొందించడమే. దేశంలోని పౌరులు వివిధ రకాలైన ఆచార, సాంప్రదాయాలతో సంమ్మిళితమైన విభిన్న మతాలు, వైవిధ్యాలను కలిగి ఉన్నారు. కాబట్టి, వారి మధ్య ఒక్కొక్కసారి అనుకోని సమయంలోనో... లేదా ఏదైనా సందర్భంలోనో విభేదాలు తలెత్తడం సాధారణం. జాతీయ సమైక్యతను కొనసాగించడం ద్వారా, మనం ఈ వైరుధ్యాలను అత్యల్ప స్థాయికి తగ్గించగలం. అలాగే దేశ సుస్థిర అభివృద్ధి పథానికి ఎంతో దోహదపడుతుంది.

## భారతదేశంలో జాతీయ సమైక్యత అవసరం

జనాభా పరంగా, భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద దేశం. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో మతాలకు చెందిన ప్రజలు ఉన్న ఏకైక దేశం మనదే. దేశంలో ఉన్న ముఖ్యమైన మతాలు హిందూమతం, ఇస్లాం, క్రైస్తవం, బౌద్ధమతం, జైనమతం, సిక్కుమతంతో పాటు జొరాస్ట్రియన్ కూడా ఉంది. ఈ మతాల వారందరికీ ఆచార వ్యవహారాలు, సంస్కృతులు, సాంప్రదాయాలు, నమ్మకాలు ఉన్నాయి. వాటన్నింటినీ ఒకే చోట ముడి వేయడం చాలా ముఖ్యం.

అందుకు జాతీయ సమగ్రత ఒక్కటే వీటన్నింటిని ఏకతాటిపైకా తేవడానికి ఉన్న ఏకైక సాధనం. సమగ్రత యొక్క శక్తితో, భారతదేశం ప్రాచీన కాలం నుండి తన వారసత్వాన్ని కొనసాగిస్తోంది. భిన్న సంస్కృతులు, నాగరికతలు ఉన్నప్పటికీ భిన్న మతాలకు చెందిన వారు భారతదేశంలో శాంతి సౌభ్రాతృత్వంతో జీవిస్తున్నారు. సహజ వనరుల కొరతతో కూడా భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నది కేవలం జాతీయ సమైక్యతా శక్తి మాత్రమే. 'భిన్నత్వంలో ఏకత్వం' అనేది భారతదేశం ప్రత్యేకత. ఇదే మన దేశ జాతీయ సమైక్యతను నిరూపిస్తోంది. భారతీయ సంస్కృతిలో ఉన్న వైవిధ్యాలు దాని అందం అయితే... జాతీయ సమైక్యతే దాని గుర్తింపు. ఇది సుదీర్ఘకాలం బలంగా ఉంటుంది. భారతదేశం అభివృద్ధిపథం వైపు పురోగతివైపు వెళుతోందనడానికి ఇదే నిదర్శనం. భారతదేశంలో ప్రతి మతం విలువలను, గౌరవాన్ని సమానంగా పరిగణిస్తుంది. కాబటే మన దేశం 'జాతీయ సమైక్యతకు' ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుంది. దేశ ప్రజలంతా ఒకేలా జీవించాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో 'జాతీయ సమైక్యత దినోత్సవాన్ని' నిర్వహించుకోవడం ద్వారా దేశ సమైఖ్యతను, సమగ్రతను కాపాడేందుకు ఎంతో దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వం

(మిగతా 8వ పేజీలో)



(7వ పేజీతరువాయి)

## ''రాష్ట్రీయ ఏక్తా దివస్...'

ప్రతి సంవత్సరం ''రాష్ట్రీయ ఏక్తా దివస్...'' అంటే ''జాతీయ సమైఖ్యతా దినోత్సవాన్ని'' నిర్వహిస్తోంది. దేశం లో మతతత్వం, కులతత్వం, ప్రాంతీయవాదం, భాషావాదం, సంకుచిత మనస్తత్వంతో దురాచాలకు దగ్గరగా ఉన్న వారందనీ 'సమైక్య' మార్గంలో నడిపిచేందుకు కేంద్రం పలు తీర్మానాలు చేస్తోంది. దేశ సమైఖ్యత, సమగ్రతను కాపాకోవడానికి అవసరమైన మార్గాలను కనుగొని, ఖచ్చితమైన తీర్మానాలను రూపొందించడానికి అప్పటి ప్రధాన మంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ 1961 సెప్టెంబర్ అక్టోబర్‌లో 'జాతీయ సమైక్యతా సదస్సు'ను నిర్వహించారు.

భారతదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 19వ తేదీన జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మన దేశంలో నివసించే ప్రజలు శాంతి... సమానత్వం... సామరస్యంతో కలసికట్టుగా జీవిస్తూ దేశ సమగ్రతను పెంపొందించడానికే 'జాతీయ సమైక్యత' దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. జాతీయ సమైఖ్యత దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక ఉన్న మరో లక్ష్యం ఉంది. దేశాన్ని ప్రపంచ దేశాల ముంగిట అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కూడా దోహదపడుతుంది. అలాగే ఒక జాతి ప్రజల మధ్య ఉన్న సమగ్రతా భావం మాత్రమే వారందరినీ జాతీయతా భావనతో కట్టిపడేయగలదు. దీని మూలంగానే ప్రజల మధ్య ఉన్న పోటీని మర్చిపోయి, ఒకరి అభివృద్ధి కోసం మరొకరు సహకరిస్తూ.. కలిసికట్టుగా ముందుకు కదిలేందుకు ఒకే తాటిపై నిలబడేందుకు దారి తీస్తుంది.



మరిచి ఐక్యతా భావంతో ముందుకు కలిసికట్టుగా వచ్చినప్పుడే ''అభివృద్ధి ఫలం' అనేది మనకు లభిస్తుంది. ఇందిరాగాంధీ మార్గదర్శకత్వంలో, మన దేశం వివిధ మతాలు, వర్గాల ప్రజల మధ్య ఐక్యతా భావాన్ని పెంపొందించడంలో ప్రధాన భూమిక పోషించారు. ప్రజలంతా ఏక మనస్సుతో... చేయి చేయి జోడించినట్లయితే స్థిరమైన అభివద్ధి వైపు దేశం నడుస్తుందని ఇందిరాగాంధీ భావించారు.

## ''క్విామి ఏకాతా వీక్''

జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మనం 'క్వామి ఏక్తా వీక్'ను కూడా నవంబర్ 19 నుండి నవంబర్ 25 వరకు జరుపుకుంటున్నాం. క్వామీ ఏక్తా వీక్'ను 7 రోజుల పాటు.. ప్రతి రోజు ఒక విభిన్న అంశాలతో 'క్వామీ ఏక్తా వీక్'ను నవంబర్ 19న మన దేశ తొలి మహిళా ప్రధాన మంత్రి, దివంగత శ్రీమతి ఇందిరా గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా ప్రారంభించుకుంటున్నాం. దేశంలోని ప్రతి వ్యక్తి ప్రేమ, ఐక్యత, శాంతి మరియు సౌభ్రాతృత్వంతో కూడుకున్న పరిజ్ఞానాన్ని ప్రజలకు విస్తరింపజేయాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం. భారత దేశంలో మహిళలు, ప్రజల కోసం వారి మెరుగైన కార్యకలాపాల నిర్వహణ, ఆచరణ, వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభను కనబరచిన గొప్ప వ్యక్తులకు తగిన గౌరవం ఇవ్వడానికి ప్రజలను ప్రోత్సహించడానికి వీలుగా 'క్వామీ ఏక్తా వీక్'ను మనం జరుపుకుంటున్నాం.

''క్వామీ ఏక్తా వీక్'' కార్యక్రమంలో భాగంగా భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల పట్ల గౌరవ ప్రధమైన వైఖరిని ప్రజల్లో కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను రూపొందించింది. ప్రజల వైఖరిలో దేశభక్తి, సమగ్రత, దేశాభివృద్ధికి దోహదపడేలా విభిన్న అంశాలను సిద్ధంచేసి క్వామీ ఏక్తా వీక్‌లో అమలు చేయదానికి సన్నద్ధమవుతున్నారు. దేశంలోని ప్రతి ఒక్కరి శ్రేయస్సు, భారత దేశ అభివృద్ధికి సరళమైన మార్గాన్ని నిర్మించి ప్రజలు మరింత దగ్గర చేయడమే క్వామీ ఏక్తా వీక్ లక్ష్యం.

మెరుగైన భారతదేశాన్ని భావితరాలు చూసేందుకు అవసరమచైన ప్రణాళికలపై కసరత్తు చేయాలని, బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయడానికి మార్గాన్వేషణ చేడానికే జాతీయ సమగ్రత దినోత్సవం... క్వామీ ఏక్తా వీక్. దేశంలో ఉన్న ప్రతీ అంశాన్ని ఒకేవిధంగా సరిష్కరించుకోవాలనుకోవడం ఎంతో కష్టతరం. అందుకు మెరుగైన మార్గాలు, పద్ధతులు, విధివిధానాలు, అమలు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ఒక క్రమపద్ధతిలో నిర్వహించేందుకు వీలుపడుతుంది. దేశాభివృద్ధికి ఏయే రంగాలు అభివృద్ధి చెందాలి, ఏయే రంగాలను మరింత ఎక్కువ ప్రోత్సహించాలి, ఏయే రంగాలకు ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలి... ఇలా ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. వీటన్నింటిని ఏకతాటిపైకి తీసుకురావడానికి కుల,మత వర్గ లింగ భేదాలను



## అత్యంత ప్రియమైన ప్రధానమంత్రిగా

దేశ ప్రజల పట్ల.. ప్రత్యేకించి నిరుపేద కుటుంబాలకు చెందిన వారిపై ఆమెకున్న ప్రేమాభిమానాలే దేశ ప్రధానిగా పలుమార్లు ప్రజలకు అత్యంత ప్రియమైన ప్రధాన మం త్రిగా కీర్తిని సంపాధించి పెట్టింది. 1984లో దారుణ హత్యకు గురైన తరువాత కేంద్ర ప్రభుత్వం ఇందిరాగాంధీ జన్మదినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మన దేశంలో జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించిం ది. దివంగత ఇందిరా గాంధీకి దేశ ప్రజల పట్ల ఉన్న, ప్రేమ. సంరక్షణకు చిహ్నంగా ఈ జాతీయ సమైక్యతా దినోత్సవం అంకిత మని మనం చెప్పుకోవచ్చు.

## ఇందిరా గాంధీ అవార్డ్ ఫర్ నేషనల్ ఇంటెగ్రేషన్'

1984లో ఇందిరా గాంధీ మరణానంతరం, కేంద్ర ప్రభుత్వం 1985లో 'ఇందిరా గాంధీ అవార్డ్ ఫర్ నేషనల్ ఇంటెగ్రేషన్' అవార్డును ఏర్పాటు చేసింది. ఈ అవార్డును మన దేశం లో ప్రజాభిమానాన్ని చూరగొన్న వ్యక్తులు, నాయకుడు మరియు భారత మాజీ ప్రధాని దివం గత ఇందిరా గాంధీకి నివాళి. జాతీయ స్థాయిలో ప్రజల మధ్య సమగ్రతను కాపాడుతూ... గ్రామగ్రామా ల్లో ఐక్యతాభావాన్ని పెంపొందిస్తూ దేశ సమగ్రతను కాపాడుతూ... ప్రజలను ఆ దిశప్రోత్సహించే వ్యక్తులకు 'నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు'ను కేంద్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఈ అవార్డును ప్రతి సంవత్సరం అక్టోబర్ 31వ తేదీన ప్రధానం చేస్తారు. నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు ఎంపిక కోసం కేంద్రం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ అవార్డు కింద, అవార్డు గ్రహీతకు 5 లక్షల నగదు, ప్రతిష్టాత్మకమైన ప్రశంసాపత్రం అందజేస్తారు.




ప్రతీ ఏటా నిర్వహించే ఈ రాష్ట్రీయ ఏక్తా దివస్... కార్యక్రమాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ ఈవెంట్‌లలో మారథాన్, దేశ సమైఖ్యత కోసం ప్రచార కార్యక్రమాలతో పాటు మతసామరస్యం, మానవ సారూప్య కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నారు. అలాగే పలు సందర్భాలలో ముఖ్యమైన కార్యక్రమాలతో పాటు అంతరాష్ట్ర యువజన వారోత్సవాలు (ఇంటర్%--%స్టేట్ యూత్ ఎక్ఛ్సేంజ్ ప్రోగ్రామ్స్), జాతీయ యువ అవార్డు (నేషనల్ యూత్ అవార్డ్) కూడా దీనిలో భాగమై ఉన్నాయి. అలాగే, ప్రజల కోసం జాతీయ సమైక్యత క్యాంపులు, జాతీయ యువజనోత్సవాలు (నేషనల్ యూత్ ఫెస్టివల్స్) నిర్వహించి యుతరానికి జాతి సమైక్యత...దేశ అభివృద్ధికి యువతరం యొక్క పాత్రను గుర్తు చేసే విధంగా కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాలన్నీ ఒకే ప్రాంతంలో గానీ...లేదంటే దేశంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. అలాగే విభిన్న వర్గాల ప్రజల మధ్య మతసామరస్యం పెంపొందించి... దేశ సమగ్రతను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.జాతీయ సమగ్రత, సమైక్యతా దినోత్సవం సందర్భంగా దివంగత భారత ప్రధాని ఇందిరాగాంధీ మన దేశానికి చేసిన గొప్ప పనులను గుర్తు చేసుకుంటూ, ఆమె విగ్రహాల వద్ద ఘన నివాళులు అర్పిస్తున్నాం.

(మిగతా 9వ పేజీలో)



( 8వ పేజీ తరువాయి)

దేశంలోని అన్ని వర్గాల... మతాల ప్రజలు, చిన్నారులు, విద్యార్థులు, ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవల గురించి వేదికలపై, బహిరంగ సభలో 'దేశ ఏకీకరణ' అంశంపై ప్రసంగిస్తుంటాం. దేశంలో శాంతి, శ్రేయస్సుతో ప్రజలంతా ఐక్యమత్యంతో, దేశ సమగ్రతకు మద్దతు ఇస్తూ, ఇతరులను ప్రోత్సహిస్తామని మనస్సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నాం.

జాతీయ సమైక్యత దినోత్సవ లక్ష్యాలు, ప్రాముఖ్యత మనకు ఎంత ముఖ్యమో జాతీయ సమైక్యతా దినోత్సవం కూడా అంతే ముఖ్యం. జాతీయ సమైక్యత దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా పిల్లలు తమ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం లభిస్తుందనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. బాలల ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన బాలబాలికలకు బహుమతులు అందజేసి వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు కేంద్రం పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నారు. ఈ కార్యక్రమల నిర్వహణ మూలంగా విద్యార్థులు కనబరుస్తున్న ప్రతిభకు సంబంధించిన రంగాలల్లో వారు మరింత ప్రతిభను సాధించేందుకు రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను కేంద్రం నిర్వహిస్తోంది. ఆ రోజు జరిగే అన్ని కార్యక్రమాలు జాతీయ సమగ్రతను పెంపొందించడంపైనే దృష్టి సారిస్తాయి. వీటి ద్వారా ప్రజలు తమ జీవితంలో చిత్తశుద్ధితో కలిగిన విలువలను తెలుసుకునే అవకాశం లభిస్తుంది. దేశం ఐక్యత, సమగ్రతల వేదికపై నిలబడి వారు చేసే ప్రచారం ప్రజల్లో ఐక్యతారాగాన్ని అభివృద్ధి చేస్తుంది.

**నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్**

మన దేశంలో నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్ 1961 సంవత్సరంలో స్థాపించబడింది. ఇందులో దేశంలోని కొంతమంది ప్రముఖ వ్యక్తులు, కొంతమంది బాలీవుడ్ ప్రముఖులు, రాజకీయ నాయకులతో పాటు భారత ప్రధాని ఉన్నారు. వివిధ కులాలు, మతాలు, వర్గాలు, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల మధ్య వివాదాల నుండి ఉత్పన్నమయ్యే సమస్యలపై కౌన్సిల్ తన దృష్టి సారిస్తుంది. జాతీయ సమైక్యతా మండలిని అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఏర్పాటు చేశారు. దేశంలో జాతీయ సమైక్యత ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని, అధికార యంత్రాంగం "నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్" ఏర్పాటు చేసింది.

**ముగింపు**

దేశాభివృద్ధికి జాతీయ సమగ్రత అత్యంత ముఖ్యమైన అంశం. దానిని ప్రజలే స్వయంగా నిర్వహించగలరు. శాంతియుత అభివృద్ధికి దారితీసే దేశం కోసం ప్రజల మధ్య పరస్పర ప్రేమ, శ్రద్ధ, సోదరభావం కంటే ముఖ్యమైనది మరొకటి లేదు. మన భావితరాల వారికి ఆరోగ్యకరమైన భవిష్యత్తును... సురక్షితమైన... సంతోషకరమైన జీవితాన్ని అందించడమే 'జాతీయ సమైక్యత'... రాష్ట్రీయ ఏక్తా దివస్...!!!

**వి.వి.వెంకటేశ్వర రావు, 6300866637.**

# కనుమరుగు అవుతున్న కట్టడాలు

## నవంబర్ 19...ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినం.

ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినోత్సవం ప్రతి ఏట నవంబర్ 19న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వారసత్వ పరిరక్షణ అంశాల ఆధారంగా 1984, జనవరి 27న నాటి భారతదేశ ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చైర్మన్‌గా భారత జాతీయ సంస్కృ తి వారసత్వ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ -ఇంటాక్) అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. దీనికి తోడుగా, భారతదేశ వారసత్వ సంపద విలువ, వాటి పరిర క్షణపై ప్రజల్లో అవగాహన కలిపించేందుకు 'భారత ప్రభుత్వ సాంస్కృ తిక శాఖ','రాష్ట్ర పురావస్తు శాఖ'లకు బాధ్యతలు అప్పగించ బడ్డాయి.

అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహవంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకులలో అక్కడక్కడ నిక్షిప్తమైయున్న చరిత్ర కొంతవరకు వెలుగులోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. శ్రీమ-ఖుని కి చెందిన నాణాలను, ధర్మపురి వాస్తవ్యుడైన చారిత్రక పరిశోధకుడు కీర్తిశేషులు సంగనభట్ల నరహరిశర్మ కనుగొన్నాక, శాతవాహన వంశానికి మూల పురుషుడు అనదగిన శ్రీముఖుడు, కోటిలింగాల రాజధానిగా చేసుకొని పరిపాలించాడని రుజువైనాక, చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెనవేసుకున్న చరిత్ర పలుకుతుంది.

శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్టలేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీభూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గంలోని పాషా యిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాతవాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపాన్ని కి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాగ సింపీ యకాయ, జమజోరాగ బ్రహ్మ లేఖలు, స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం - కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్నపూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సేనియా వాగు - చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరోవైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

## సినిమా రివ్యూ

కొత్త హీరో విక్రాంత్ రెడ్డి ప్రధాన పాత్రలో నటించడమే కాకుండా దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్ లైఫ్' . మెహ్రీన్ పిర్జాదా, రుక్సర్ ఢిల్లాన్ హీరోయిన్స్ గా నటించారు. డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై లీలా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇక చాలా రోజులుగా ఈ సినిమా ప్రమోషన్స్ ఇంట్రెస్టింగ్ గా జరుగుతున్నాయి. ఎట్టకేలకు సినిమా నవంబర్ 17 న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రమోషనల్ మెటీరియల్ తో ఇంట్రెస్ట్ క్రియేట్ చేసిన ఈ చిత్రం ఎలా ఉంది? కథేంటి? బెస్ట్ అనిపించే అంశాలేంటి? అనేది రివ్యూలో చూద్దాం.




**కథ :**
నగరంలో జై(విక్రాంత్) మెడికోగా వర్క్ చేస్తుంటాడు. ఈ సందర్భంగా కొందరు అమ్మాయిలను వృత్తిరీత్యా ఫాలో అవుతుంటాడు. ఈ క్రమంలో అతను ఫాలో చేసిన కొందరు అమ్మాయిలు ఉన్నట్టుండి సైకోగా బిహేవ్ చేస్తుంటారు. ఆవెంటనే చనిపోతారు. ఇదంతా పరిశీలించిన పోలీసులు అమ్మాయిలను ఫాలో అవుతున్న కారణంగా జైని అరెస్ట్ చేస్తారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత అతని గర్ల్ ఫ్రెండ్ రుక్సర్ ఢిల్లాన్ కూడా చనిపోతుంది. అప్పటికే జైతో పరిచయం ఉన్న మెహ్రీన్ పిర్జాదా ప్రాణాలకు ప్రమాదాం ఏర్పడుతుంది. దాంతో అతని దూరంగా ఉంటుంది. ఇదిలా ఉంటే.. జై,, ఆర్య అనే మరో వ్యక్తిగానూ కనిపిస్తాడు. అసలు ఇంతకీ అతను రెండుపేర్లు ఎందుకు పెట్టుకున్నాడు? అమ్మాయిలు సైకోలా ప్రవర్తించడానికి రీజన్ ఏంటీ? రుక్సన్ మరణానికి కారణం ఎవరు? మెహ్రీన్ బతికి ఉందా చనిపోయిందా? పోలీసులు ఏం నిర్ధారించారు. నిందితుడు ఎవరు? అనేది మిగితా సినిమా.

**విశ్లేషణ :**
యాక్షన్ థ్రిల్లర్లకు ఎంతటి క్రేజ్ ఉంటుందో తెలిసిందే. అలాంటి జోనర్లలోని సినిమాలు చూసేందుకు సెపరేట్ ఆడియెన్స్ ఉండటం విశేషం. అయితే ఈ సినిమా చూసినప్పుడు అసలు ఏ జోనర్ కిందికి వస్తుందో అర్థం కావడానికి సమయం పడుతుంది. యాక్షన్ థ్రిల్లర్ అంశాలతో పాటు రొమాన్స్ టచ్ తో మిళితమై ఉంటుందనే లోపే.. కాస్తా కామెడీనీ కూడా పండించారు. ఇదిలా ఉంటే.. అమెరికాలోనే కొన్ని ఇన్సిడెంట్స్ ఆధారంగా రాసుకున్న కథను కొత్తగా, సరికొత్త పాయింట్ తో ప్రజెంట్ చేశారు. వైజాగ్, హైదరాబాద్, ఢిల్లీ, కొన్ని ట్రైబల్ ఏరియాల్లోనూ కథ సాగుతుంది.

మొదటి భాగమంతా చాలా కన్ఫ్యూషన్ గానే ఉంటుంది. మొదట చెప్పినట్టుగా ఏ జోనర్ లో చెబుతున్నారనేదానికి కాస్తా సమయం తీసుకున్నారు. ఇక చిత్రంలోని ట్విస్ట్ లు అర్థం కాకపోయినా కథకు అవసరమనే ఉంటాయి. ప్రథమార్థం హీరోహీరోయిన్ల మధ్య రొమాంటిక్ సీన్లు, పలు హత్యలను చూపించారు. ఇదంతా ఇంట్రడక్షన్ లో లాగనే అనిపిస్తుంది. సెకండాఫ్ లో మాత్రం అసలు కథను దాచి ఉంచారనేది తెలుస్తుంది. ఎందుకంటే దర్శకుడు చెప్పిన కొత్త పాయింట్ ఇక్కడే చూపించారు. ఆర్మీ డాక్టర్ చేసే ప్రయోగాల వల్లే అందరూ చనిపోతున్నారని తెలిపారు. టెర్రరిస్ట్ లను మన కంట్రోల్ కు తీసుకునేందుకు మెదడుపై కొన్ని ప్రయోగాలను చేస్తుంటారు. ప్రయోగాలను చక్కగా చూపించారు. మొదటి భాగం కంటే.. ద్వితీ–యార్థంలోనే అసలు సినిమా నడుస్తుంది. కథ పెద్దనే ఫీలింగ్ అనిపిస్తుంది. కొన్ని లాజిక్ లు లేని సీన్లు సినిమా అంతటా కనిపిస్తుంటాయి. మొత్తానికి సినిమాలోని కొత్త పాయింట్ గుర్తుండేలా చేశారు.

**నటీనటులు, టెక్నీషియన్లు :**
విక్రాంత్ నటన కథకు ప్రధానం కావడంతో ఇంకా బాగా పెర్ఫామ్ చేయాల్సింది. ముఖ్యంగా 'జై' పాత్రలో అదరగొట్టారు. హీరోయిన్లు మెహ్రీన్ పిర్జాదా మరియు రుక్సర్ ఢిల్లాన్ బాగానే అలరించారు. థ్రిల్లర్ అంశాలను ఆడియెన్స్ కు బాగా కనెక్ట్ అయ్యేలా పెర్ఫామ్ చేశారు. కొన్ని చోట్ల కాస్తా ఇబ్బందిగానే మారింది. ఇక కథ, స్క్రీన్ ప్లే చాలా కొత్త అనిపిస్తుంది. విక్రాంత్ తన దర్శక ప్రతిభనూ చూపించే ప్రయత్నం చేశారు. కానీ కాస్టింగ్ విషయంలో ఇంకాస్తా ముందడు వేస్తే సినిమా స్థాయి పెరిగేది. కొత్త అంశాలను చెప్పినప్పటికీ ఎఫెక్టివ్ గా చెప్పడంలో విఫలమయ్యారు. చిత్రానికి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా పర్లేదనిపించింది.

---

కన్నడ హీరో రక్షిత్‌శెట్టి ఒక ప్రక్క మాస్ సినిమాలు చేస్తూనే.. మధ్య మధ్యలో ప్రయోగాత్మక చిత్రాలతోనూ మనలని పలకరిస్తున్నారు. డిఫరెంట్ టేస్ట్ తో విభిన్నంగా సాగే ఆయన సినిమాలు తెలుగువారినీ ఆకర్శిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయన ఈసారి ఓ ప్రేమకథని ఎంచుకుని 'సప్తసాగరదాచే ఎల్లో' అనే సినిమా చేశారు. కవితాత్మకమైన ఈ సినిమా తెలుగులో 'సప్త సాగరాలు దాటి' పేరుతో విడుదలైంది. కన్నడంలో సెన్సేషన్ అయిన ఆ చిత్రం తెలుగులో అంతగా పోలేదు. ఓ వర్గానికి మాత్రం బాగా నచ్చింది. ఇప్పుడు ఆ సినిమా సెకండ్ పార్ట్ రిలీజ్ అయ్యింది. ఈ సెకండ్ పార్ట్ ఎలా ఉంది? ఈ మూవీ పంచిన ఫీల్ ఏంటి?




**స్టోరీలైన్**
ఫస్ట్ పార్ట్ లో ... హీరో మను (రక్షిత్ శెట్టి), ప్రియ (రుక్మిణీ వసంత్) లవర్స్.. శంకర్ గౌడ (అవినాష్) అనే ఇండస్ట్రలియస్ట్ దగ్గర డ్రైవర్గా పనిచేస్తుంటాడు మను.ఇక హీరోయిన్ ప్రియ...ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు సింగర్ అవ్వాలనే ప్రయత్నాల్లో ఉంటుంది. లో మిడిల్ క్లాస్ కు చెందిన వీళ్లిద్దరూ ఖాళీ దొరికినప్పుడల్లా భవిష్యత్తు గురించి అందమైన కలలు కంటూంటారు. ఇంక పెళ్లి చేసుకుని, జీవితంలో స్థిరపడి పోదాం అని ..డబ్బు కోసం తను చేయని తప్పుని తనపైన వేసు కుంటాడు మను. ఎవరో చేసిన యాక్సిడెంట్ కేసుని మను(రక్షిత్ శెట్టి) డబ్బుల కోసం ఒప్పుకొని బయటకి వచ్చి ఆ డబ్బులతో ఇల్లు కట్టుకుందామని తన లవర్ ప్రియ (రుక్మిణి వసంత్) ఒప్పుకోకపోయినా జైలుకి వెళ్తాడు. కేసు ఇచ్చిన వాళ్ళు చనిపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో మను పదేళ్లు జైలులోనే ఉండి బయటకి వస్తాడు. ఈ లోపు ప్రియ ఇంకో పెళ్లి చేసేసుకుంటుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అంటే రెండో పార్ట్ లో చూపించారు.. మను జైలు నుంచి వస్తాడు. ఆ తర్వాత ఓ ఉద్యోగంలో జాయిన్ అవుతాడు. తన ప్రేయసి జ్ఞాపకాలే గుర్తుకు వస్తుండటంతో ఆమెని వెతుకుతూంటాడు. మరో ప్రక్క ప్రియ పెళ్లి చేసుకున్న అతను బిజినెస్ లో లాస్ అవ్వతాడు. దాంతో తాగుడికి బానిసైపోయి ఇంటిని పట్టించుకోడు. దీంతో ప్రియ కష్టపడుతూ ఇంటిని లాగుతూంటుంది. ఇదంతా మను చూస్తాడు. తాను ప్రేమించిన అమ్మాయి సంతోషంగా లేదని తెలిసిన మను ఆమెని సంతోషంగా ఉంచడానికి తన వంతు ప్రయత్నాలు మొదలెడతాడు..అవి ఏమిటి? వాళ్ళ కష్టాలు ఎలా తీర్చాడు? ఈ జర్నిలో తనకి వేశ్య సురభి(చిత్ర జై ఆచార్) దగ్గరవగా ఆమె కోసం ఏం చేశాడు? జైలు నుండి తనని బయటకి తీసుకురాకుండా వదిలేసిన ప్రభు (అచ్యుత్ కుమార్)కు ఏం శిక్ష విధించాడు.. ?అంతేకాకుండా జైలులో తనతో గొడవ పడ్డవాళ్ళు బయట కూడా టార్గెట్ చేసినప్పుడు ఏం చేసాడు వంటి విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

**విశ్లేషణ**
మొదటి పార్ట్ ప్రేమలో పడిన ఓ జంట భావోగ్వేగ ప్రయాణం ప్రధానంగా రూపొందించారు. అందమైన కలలు కన్న ఆ జంట ప్రయాణాన్ని విధి ఎలా ప్రభావితం చేసింది? అనేది చూపించారు. వాస్తవానికి ఫస్ట్ పార్ట్ లో కథగా పెద్దగా జరిగేది ఏమీ లేకపోయినా కవితాత్మకంగా తెరపై చక్కటి విజువల్స్ తో ఆవిష్కరించారు దర్శకుడు హేమంత్. అది చాలా మందికి నచ్చింది. ముఖ్యంగా సముద్రంతో ముడిపెడుతూ ఆ కథని చెప్పాడు. సముద్రంలోని ప్రశాంతత, కల్లోలాలు రెండూ ఈ కథలో ఆవిష్కృతమయ్యేలా చేసారు. ప్రధాన పాత్రలో కనిపించే ప్రేమజంట మధ్య కెమిస్ట్రీ, భావోద్వేగాలే ఈ సినిమాకి కీలకమైంది. ఇక సెకండ్ పార్ట్ కు వచ్చేసరికి ఆ స్థాయిలో ఇక్కడ సీన్స్ పండించటానికి కంటెంట్ లేదు. మరీ ముఖ్యంగా ఈ సెకండ్ పార్ట్ కు వచ్చేసరికి హీరోయిన్ కు పెళ్లైపోతుంది. కానీ జైలు నుంచి వచ్చిన హీరో పెళ్ళైపోయిన తన మాజీ ప్రేయసి మీద ప్రేమ చావక ఆమె చుట్టూ తిరుగుతూంటాడు. ఆమె సంతోషం కోసం పాటుపడుతూంటాడు. మధ్య మధ్యలో తనకే పరిస్థితి క్రియేట్ చేసిన వాళ్లపై కాస్తంత రివేంజ్..అంతకు మించి ఏమీ లేదు.అది విసుగ్గా అనిపిస్తుంది. అయితే దర్శకుడు విజువల్ కు విజువల్ మధ్య ఉండే ఫీల్ ని మాత్రం చాలాజాగ్రత్తగా తీసుకొచ్చే ప్రయత్నం చేసాడు. అవి ఆకట్టుకుంటాయి. నిజానికి రెండు పార్ట్ లు కలిపి ఒకే సినిమాగా వదిలితే బాగుండును అనిపిస్తుంది. ఇంటర్వెల్ దాకా ఫస్ట్ పార్ట్ ..అక్కడ నుంచి సెకండ్ పార్ట్ అయితే మనకు ఇక్కడ వర్కవుట్ అయ్యేది. అలాగే మొదటి భాగం క్లైమాక్స్ చూసేసి...ఇందులో ఈ రెండో పార్ట్ లో రివేంజ్ సీన్స్ భారీ ఎత్తున ఉంటాయి.యాక్షన్ తో అదరకొడతాడు అనకుంటే మనకు నిరాశే ఎదురౌతుంది. ఇక ఈ సైడ్ బి లో వేశ్య పాత్రను తీసుకొచ్చారు. ఆ పాత్ర..దేవదాసుని గుర్తు చేస్తుంది. టోటల్ గా దేవదాసుని దగ్గర పెట్టుకుని చేసినట్లు అనిపిస్తుంది. ఓవరాల్ గా మన తెలుగువారికి కాస్తంత నలుగుడుపడని కథాంశమే. ఈ సినిమా చాలా సీన్స్ నిదానంగా సాగుతుంటాయి. సెకండాఫ్ కూడా మరీ భారంగా అనిపించడంతోపాటు, కథ కూడా ఏమాత్రం ముందుకు సాగుతున్నట్టు అనిపించదు. ఏదైమైనా ఇంత సాగతీతను భరించే ఓపిక మనవాళ్లకు తక్కువనే చెప్పాలి. ఓటిటిలో వెబ్ సిరీస్ లు చూస్తున్న సమయంలో కాస్తంత స్పీడు పెంచింతే కానీ భరించలేం అనిపిస్తుంది.

**టెక్నికల్ గా చెప్పాలంటే .**
మొదటి పార్ట్ ఉన్నంత ఉన్నతంగా సాంకేతికంగా లేదు. అయితే ఈ పార్ట్ కు కూడా చరణ్ రాజ్ సంగీతం, అద్వైత గురుమూర్తి కెమెరా పనితనం సినిమాకి ప్రధాన బలం. ప్రేమకథకి తగ్గ మూడ్‌ని క్రియేట్ చేసేందుకు ప్రయత్నించారు. కానీ అక్కడ ప్రేమ కథే లేదు. వార్ వన్ సైడ్ అయ్యిపోయింది. దర్శకుడు హేమంత్ తాను కమర్షియల్ ఎలిమెంట్స్ వైపుకు వెళ్లకుండా నిజాయతీగా కథ చెప్పే ప్రయత్నం చేసాను అనుకున్నారు. కానీ అంత లేదు అని మనకు అనిపిస్తుంది. కొన్ని మనస్సుని తట్టే డైలాగులు,సీన్స్ అక్కడక్కడా మెరుస్తూ ఆకట్టుకుంటాయి. అయితే అవి వచ్చే సమయానికి మనం ఎలర్ట్ గా ఉండాలి. నిద్రపోకూడదు. నిర్మాణం ఉన్నతంగా ఉంది. ఎడిటర్ మాత్రం కాస్తంత కనికరం చూపించి మినిమం ఓ అరగంట లేపేస్తే ...ఆ లాగుడు తగ్గుతుందనిపించింది.

**నటీనటుల్లో ...**
రక్షిత్‌శెట్టి ఈ రెండో పాత్రలోనూ అలా ఫీల్ గుడ్ సీన్స్ పండించుకుంటూ వెళ్లారు. రుక్మిణీ వసంత్ కు సీన్స్ తక్కువే. దానికి తోడు ఇద్దరి జోడీ, వాళ్ల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది అనటానికి అసలు జోడినే కాదు. అచ్యుత్ కుమార్, శరత్ లోహితాశ్వ, రమేష్ ఇందిర, గోపాలకృష్ణ దేశ్‌పాండే తదితరులు పాత్రల్లో ఒదిగిపోయారు.

**ఫైనల్ థాట్..**
మన అదృష్టం ఏమిటి అంటే క్యాసెట్ కు ఏ,బి అని రెండు వైపులే ఉండటం..లేకపోతే డైరక్టర్ మూడో భాగం కోసం కథని అట్టి పెట్టుకుందుడు. అప్పుడు మనమంతా సైడ్-సి పేరుతో విడుదలయ్యే మూడో భాగం సినిమా వరకూ ఎదురు చూడాల్సి వచ్చేది.

# సినిమా రివ్యూ

ఆర్ఎక్స్ 100 చిత్రంతో ఒక్కసారిగా స్టార్స్ అయిపోయాడు హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, దర్శకుడు అజయ్‌భూపతి, హీరో కార్తికేయ. అయితే ఈ ముగ్గురికి మళ్లీ హిట్ పడలేదు. ఎన్నోప్రయత్నాలు చేసినా నిరాశే ఎదురయ్యింది. ఈనేపథ్యంలో తాజాగా దర్శకుడు అజయ్, హీరోయిన్ పాయల్ మరోసారి కలిశారు. హిట్ కొట్టాలని డిసైడ్ అయ్యారు. తాజాగా మంగళవారం అనే సినిమాతో వస్తున్నారు. ఇందులో పాయల్‌తోపాటు నందితా శ్వేత, రవీంద్ర విజయ్, శ్రీతేజ్, అజయ్ ఘోస్ ముఖ్య పాత్రలు పోషించారు. స్వాతిర్డ్డి గునుపాటి, ఎం సురేష్ వర్మ, అజయ్ భూపతి నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం(నవంబర్ 17)న విడుదలైంది. మరి సినిమా ఎలా ఉందంటే...




**కథః**

మహాలక్ష్మీపురం అనే గ్రామంలో అర్ధరాత్రి భయానక శబ్దాలు వస్తుంటాయి. ఓ లేడీ తన నెత్తిన బోనాలు ఎత్తుకుని ఊరంతా తిరుగుతుంటుంది. మరోవైపు చిన్నప్పట్నుంచి శైలజ(పాయల్ రాజ్ పుత్), రవి(చైల్డ్ ఆర్టిస్ట్) మంచి స్నేహితులు. శైలజ అమ్మ చనిపోవడంతో నాన్న రెండో పెళ్లి చేసుకుంటుంది. దీంతో అమ్మమ్మ వద్ద పెరుగుతుంటుంది. తనకు అన్ని రకాలుగా అండగా ఉన్న రవి, వాళ్ల నాన్న మంటల్లో చనిపోతారు. దీంతో శైలజ ఒంటరైపోతుంది. కట్ చేస్తే పదేళ్ల తర్వాత.. మంగళవారం రోజున ఆ ఊర్లో గోడపై ఓ జంట మధ్య అక్రమ సంబంధం ఉందని రాసి ఉంటుంది. ఇది చూసి అంతా షాక్ అవుతారు. కట్ చేస్తే ఆ ఇద్దరు ఊరు అవతల బావి వద్ద ఆత్మహత్య చేసుకుని కనిపిస్తారు. ఆ ఊరు కట్టుబాట్ల ప్రకారం, జమిందారు ప్రకాషం బాబు (చైతన్య కృష్ణ) ఆదేశాల ప్రకారం చనిపోయిన వారికి పోస్ట్ మార్టం చేయడానికి లేదు. అయితే మరో మంగళవారం కూడా అలాంటిదే గోడపై రాస్తారు,ఆ జంట ఆత్మహత్య చేసుకుంటారు. రంగంలోకి దిగిన ఎస్ఐ మీనా(నందితా స్వేత) ఇది హత్యలే అని నిర్ధారిస్తుంది. పోస్ట్ మార్టం నిర్వహిస్తుంది. అదే సమయంలో ఊర్లో ఆర్ఎంపీ డాక్టర్ విశ్వనాథం.. ఊరు చివరన ఉన్న బావి వద్ద దెయ్యం రూపంలో శైలజని చూసినట్టు చెబుతాడు. దీంతో రకరకాలు రూమర్లు ఊపందుకుంటాయి. ఎవరో కావాలనే ఈ హత్యలు చేస్తున్నారని, మంగళవారం రోజు గోడలపై ఈ అక్రమసంబంధాల పేర్లు రాస్తూ వారిని చంపేస్తున్నారని ఊరు జనం భావిస్తారు. వారిని పట్టుకోవాలని రాత్రిళ్లు కాపలా కాస్తుంటారు. మరి వారికి తెలిసిన నిజాలేంటి? విశ్వనాథం చెప్పినట్టు ఊర్లో దెయ్యం ఉందా? గోడలపై పేర్లు రాస్తున్నది ఎవరు? వారిని చంపుతున్నది ఎవరు? శైలజ ఏమైంది? శైలజ ఫ్రెండ్ రవి ఎవరు? మంగళవారం రోజునే ఎందుకు హత్యలు జరుగుతున్నాయి? జమిందార్ భార్యకి దీనికి సంబంధం ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానమే మిగిలిన కథ.

**విశ్లేషణః**

మంగళవారం సినిమా టీజర్, ట్రైలర్లని బట్టి చూస్తే ఇదొక హర్రర్, థ్రిల్లర్‌గా అనిపిస్తుంది. కానీ ఇందులో మంచి సందేశం ఉంది. గూస్‌బంమ్స్ తెప్పించే థ్రిల్లింగ్ ఎలిమెంట్లు ఉన్నాయి. సినిమాలో గ్రామ దేవత, థ్రిల్లర్ ఎలిమెంట్ల బ్యాక్ డ్రాప్‌లో అదిరిపోయే అక్రమ సంబంధాల కథని చెప్పాడు దర్శకుడు అజయ్ భూపతి. ఊహించని విషయాల ను పలు ట్విస్ట్‌ల రూపంలో వెల్లడించారు. దీంతోపాటు ఇప్పటి వరకు సినిమాల్లో చర్చకు రాని అతిగా శృంగార కోరికలు అనే అంశాన్ని కూడా టచ్ చేశాడు. ఓ రకంగా ఇలాంటి కాన్సెప్ట్ ని ఎంచుకోవడం ఓ ఛాలెంజ్ అయితే, ఆ పాత్ర చేయడం మరో ఛాలెంజింగ్, దాన్ని అంతే డేర్‌గా వెండితెరపై ఆవిష్కరించడం సైతం పెద్ద సవాల్‌తో కూడుకున్న అంశం. అయితే ఆ ఛాలెంజ్ విషయంలో దర్శకుడు, అలాంటి పాత్ర చేసిన పాయల్ రాజ్‌పుత్ సక్సెస్ అయ్యారని చెప్పొచ్చు. దీనికి %--%కాంతార%--% ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం, ఆర్ఆర్ తోడయ్యింది. బ్యాక్ బోన్‌లా నిలిచింది. అయితే ఇదొక హీరో, హీరోయిన్, విలన్ తరహా సినిమా కాదు. ఓ డిఫరెంట్ మూవీగా ఇది నిలుస్తుంది. హీరో విలన్ అనే కాన్సెప్ట్ ని బ్రేక్ చేసిన మూవీ అవుతుంది, కథే హీరోగా నడిచే మూవీగా నిలుస్తుంది.

సినిమా 1986లో ప్రారంభమవుతుంది. శైలజ, రవి స్నేహితులుగా ఎస్టాబ్లిష్ చేసి, శైలజ చిన్నప్పట్నుంచి ఎంతటి ఒంటరి తనాన్ని అనుభవిస్తుంది, తను ఎంతటి అవమానాలను ఫేస్ చేస్తుందనే విషయాలను చూపించారు. అదే సమయంలో చిన్నప్పుడే చైల్డ్ అబ్యూజింగ్ వంటి అంశాలను తను ఫేస్ చేసి చూపించి కథని ఎస్టాబ్లిష్ చేశాడు దర్శకుడు. అదే సమయంలో చాలా అంశాలను సస్పెన్స్ తో నడిపించాడు. ఆ సీన్‌లో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠని ఆడియెన్స్ లో కలిగించేలా చేశాడు. అదే టెంపోని సినిమా మొత్తం మెయింట్ చేశాడు. మొదటి భాగంలో ఊర్లో రాత్రి ఓ మహిళ దేవతలా పరిగెత్తే అంశాలు, కుక్క మొరుగుతూ ఊరంతా తిరగడం, రకరకాల శబ్దాలు థ్రిల్‌కి గురి చేస్తుంటాయి. ఏం జరుగుతుందో అనే ఉత్కంఠని రేకెత్తిస్తుంటాయి. ఈ క్రమంలో గోడలపై అక్రమసంబంధాలకు సంబంధించిన పేర్లు రాయడం వాళ్లు ఆత్మహత్య చేసుకోవడం, ఏవో సస్పెన్స్ అంశాలను చూపించడం వంటి ఆద్యంతం ఎంగేజింగ్‌గా అనిపిస్తుంటుంది. మొదటి భాగం ఎక్కడ ఆగకుండా పరుగులు పెట్టించాడు దర్శకుడు. ఇంటర్వెల్ వరకు సినిమాని పరుగులు పెట్టించారు. ఇంతటి ఉత్కంఠ పరిస్థితుల్లోనూ అజయ్ ఘోష్ పాత్రలో కామెడీని పండించాడు. ఎంటర్‌టైన్ చేశారు.

ఇంటర్వెల్ లో పాయల్ పాత్రకి సంబంధించిన ట్విస్ట్ ని రివీల్ చేస్తూ సెకండాఫ్‌పై ఆసక్తిని రేకెత్తించాడు. సెకండాఫ్ పాయల్ పాత్ర కథని చెబుతాడు. ఆమె ఎలా పెరిగింది? ఎలాంటి అవమానాలు ఫేస్ చేసింది, ఆమె ప్రేమలో విఫలం కావడం, ఊరంగా ఆమెని హేళన చేసిన కొట్టడం, అలాగే ఆమెలోని అతి శృంగార కోరికలు అనేఅంశాలను రివీల్ చేస్తూ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాడు దర్శకుడు. అయితే సెకండాఫ్ మొత్తం పాయల్ ఫ్యామిలీ అంశాలు, లవ్ ఫెయిల్యూర్ అంశాలను చాలా ఎమోషనల్‌గా, నటకీయంగా ఆవిష్కరించారు. దీంతో సినిమా వేగాన్ని తగ్గించాయి. మొదటిభాగం మాదిరిగా రేసిగా సాగలేదు. చివరి ఇరవై నిమిషాల వరకు పాయల్ క్యారెక్టర్‌లోని సంఘర్షణని, ఆమె పడ బాధలపై ప్రధానంగా ఫోకస్ చేశాడు. అవి హృదయ విదారకంగా అనిపిస్తాయి. ఇక క్లైమాక్స్ ని మాత్రం నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్లారు. ఒక్కో ట్విస్ట్ ని పరిచయం చేస్తూ, షాకింగ్ విషయాలను వెల్లడిస్తుంటే గూస్ బంమ్స్ వస్తుంటాయి. అయితే సినిమా మొత్తం సినిమాకి అజనీష్ లోక్ నాథ్ సంగీతం పెద్ద అసెట్. ఇంకా చెప్పాలంటే గూస్‌బంమ్స్ తెప్పించే ఆర్ఆర్ సినిమాని ఆద్యంతం పరుగులు పెట్టించింది. సినిమాకి అజయ్‌భూపతి కథ, టేకింగ్ ఒక ఎత్తైతే, అజనీష్ బీజీఎం రెండు ఎత్తులుగా నిలిచిందని చెప్పాలి. సినిమాకి అదే హైలైట్. సాధారణ సీన్‌ని కూడా ఎలివేట్ చేసిన తీరు అదిరిపోయింది. మంచి థ్రిల్లింగ్ ఎక్స్ పీరియెన్స్ ని ఇచ్చింది. దీనికి సీక్వెల్‌గా ఉండటం సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్. సినిమాలో కొన్ని ఎలిమెంట్లు లాజిక్‌కి అందని విధంగా ఉన్నాయి. సినిమాలో ఆర్ఆర్ ఎఫెక్ట్ తప్ప పెద్దగా కథ లేదు. హీరోయిన్ పాత్ర తాలుకూ ఎలిమెంట్లని, ఊర్లో భయానక పరిస్థితులకు అంతగా సింక్ కుదరలేదు. హీరోహీరోయిన్ అనే ఎలిమెంట్లు లేకపోవడం కొంత మైనస్‌గా చెప్పొచ్చు. పాయల్‌లోని కామ విషయాలను మరి శృతిమించినట్టుగా, బోల్డ్ గా చూపించడం కన్విన్సింగ్‌గా లేదు. ఓవర్‌డోస్ అనిపిస్తుంది.

**నటీనటులుః**

శైలజ పాత్రని ఎంచుకోవడంలోనే పాయల్ రాజ్‌పుత్ సక్సెస్ అయ్యింది. ఇలాంటి టిఫికల్ రోల్‌ని, అరుదైన పాత్రని చేయడమంటే చాలా గట్స్ కావాలి. ఎంత పెద్ద నటి అయినా ఇలాంటి రోల్స్ చేయడానికి సాహసం చేయరు. ఆ విషయంలో పాయల్ గట్స్ కి మొక్కాల్సిందే. అయితే ఆర్ఎక్స్ 100 లో కాస్త ఇలాంటి టచ్ ఉన్న పాత్ర చేయడంతో ఇందులో ఆమె పర్ ఫెక్ట్ యాప్ట్ గా నిలిచింది. పాత్రలో జీవించింది. అద్భుతమైన నటనతో మెప్పించింది, అలరించింది, భావోద్వేగానికి గురిచేసింది, గుండెల్ని పిండేసింది. అయ్యో అనేలా చేసింది. మరోవైపు అజయ్ ఘోష్ సైతం ఊర్లో బలాదూర్ తిరుగుతూ బాతకానీ కొట్టే పాత్రలో అకట్టుకున్నాడు,నవ్వులు పూయించాడు. జమిందార్‌గా చైతన్య కృష్ణ అలరించాడు. ఏజ్‌కి మించిన పాత్ర అయినా ఓకే అనిపించాడు. ఎస్ఐగా నందిత శ్వేత అదరగొట్టింది. డాక్టర్ విశ్వనాథంగా రవీంద్ర విజయ్ నటన సూపర్. ఆయన పాత్రలోని ట్విస్ట్ మైండ్ బ్లోయింగ్ అనిపిస్తుంది. శ్రీతేజ, శ్రవణ్ రెడ్డి లు సైతం మెప్పించారు. లక్ష్మణ నవ్వులు పూయించాడు. జమిందార్ భార్యగా దేవి పిళ్లై పాత్రలోని ట్విస్ట్ బాగుంది. ఆమె కూడా అదరగొట్టింది. ఇందులో నటన పరంగా ఎవరికీ వంక పెట్టడానికి లేదు. అంత బాగా చేశారు.

**టెక్నీషియన్లుః**

సినిమాకి మ్యూజిక్ పెద్ద బ్యాక్ బోన్. అజనీష్ లోక్‌నాథ్ మరోసారి రెచ్చిపోయాడు. ఆర్ఆర్‌తో పిచ్చెక్కించాడు. ఈ రేంజ్‌లో బీజీఎం లేకపోతే సినిమా ఇంత క్రేజీగా ఉండేది కాదని చెప్పొచ్చు. సౌండింగ్ మాత్రం గూస్‌బంమ్స్ తెప్పించేలా ఉంటుంది. సినిమాకి బిగ్గెస్ట్ పిల్లర్ మ్యూజిక్ డైరక్టర్. దాశరథీ శివేంద్ర కెమెరా వర్క్ సినిమాకి మరో హైలైట్. కెమెరా యాంగిల్స్ కూడా క్రేజీగా ఉన్నాయి. ఇందులో రామ్‌గోపాల్ వర్మ కెమెరా యాంగిల్స్ ఎక్కువగా కనిపించాయి. ఎడిటింగ్ పరంగా ఓకే అనిపించింది. ఇక డైరెక్షన్ సినిమాకి మరో అసెట్. అజయ్ భూపతి తీసిన షాట్స్ వాహ్ అనేలా ఉన్నాయి. సీన్లో ఏం లేకపోయినా ఆ ఎఫెక్ట్స్ తో ఉత్కంఠకి గురి చేయడం విశేషం. అయితే పాత్రలోని ఎమోషన్‌ని, ఆమె సమస్యని అవసరానికి మించి చూపించినట్టుగా అనిపిస్తుంది. ఆ విషయంలో దర్శకుడు బ్యాలెన్స్ తప్పాడనే ఫీలింగ్ కలుగుతుంది. కానీ రెండున్నర గంటలు ఆడియెన్స్ ని ఎంగేజ్ చేయడంలో మాత్రం ఆయన సక్సెస్ అయ్యాడనే చెప్పాలి.

**ఫైనల్‌గాః**

మంగళవారం థ్రిల్ చేసే మూవీ. అక్రమసంబంధాలపై సందేశం బాగుంది. దాన్ని ఓవర్ డోస్‌లో చెప్పినట్టుంది.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :

suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.


మెహ్రీన్ పిర్జాదా